# మనం కరీంనగర్

జగిత్యాల- రాజన్న సిరిసిల్ల-పెద్దపల్లి-అసిఫాబాద్-మంచిర్యాల

శనివారం | 24 | అక్టోబర్ | 2026 | పేజీలు 12 | www.manamepaper.com





## రహదారి విస్తరణలో ఇళ్లు కోల్పోయిన అర్హులైన నిర్వాసితులకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయిస్తాం

### మంత్రి పొన్నం ప్రభాకర్

**చిగురుమామిడి అక్టోబర్ 23 ( మనం న్యూస్) :** కొత్తపల్లి నుంచి హుస్నాబాద్ వరకు నిర్మిస్తున్న నాలుగు వరుసల రహదారి విస్తరణ, హుస్నాబాద్ పట్టణంలోని మల్లెచెట్టు చౌరస్తా నుంచి జనగామ మార్గంలో అక్కన్నపేట మీదుగా జరుగుతున్న రహదారి విస్తరణలో భాగంగా చిగురుమామిడి, సుందరగిరి తదితర ప్రాంతాల్లో ఇళ్లు కోల్పోయిన అర్హులైన కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించేలా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి, హుస్నాబాద్ ఎమ్మెల్యే గౌరవనీయులు పొన్నం ప్రభాకర్ గారు స్పష్టం చేశారు. అదేవిధంగా గుడిసెల్లో నివసిస్తున్న వారికి, పూర్తిగా ఇళ్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో మొదటి ప్రాధాన్యత ఇస్తున్నామని మంత్రి తెలిపారు.

- మిగతా 2లో..

## భూభారతి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

### భూముల రీ సర్వేను తహసీల్దార్లు పర్యవేక్షించాలి

### కలెక్టర్ గరిమ అగ్రవాల్




**భూభారతి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్‌తో కలిసి రెవెన్యూ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారులతో భూముల రీ సర్వే, భూభారతి దరఖాస్తులపై సమీక్ష నిర్వహించారు.**

*– సిరిసిల్ల, అక్టోబర్ 23 )మనం ప్రతినిధి)*

2




## రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలి

### కరీంనగర్ కలెక్టర్ చిత్రా మిశ్రా

- ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి తక్షణ మరమ్మతులు చేపట్టాలి
- పీఎం రహవీర్, హిట్ అండ్ రన్, నగదు రహిత వైద్యంపై విస్తృత అవగాహన
- రోడ్డు భద్రతా నిబంధనలు పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యత

**రోడ్డు ప్రమాదాలు ఎన్నో కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపుతున్నాయని, విలువైన ప్రాణాలను కాపాడేందుకు రహదారి భద్రతా నిబంధనలు కచ్చితంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. ప్రమాదాల నివారణకు రహదారులపై తరచుగా తనిఖీలు నిర్వహిస్తూ, ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి అవసరమైన మరమ్మతులు, భద్రతా చర్యలు వెంటనే చేపట్టాలని సూచించారు.**

**కరీంనగర్ అక్టోబర్ 23 (మనం బ్యూరో) :** వాహనదారులు సైతం నిర్లక్ష్యంగా వాహనాలు నడిపి తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టవద్దని హితవు పలికారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా రోడ్డు భద్రతా కమిటీ సమావేశానికి కలెక్టర్ అధ్యక్షత వహించారు.

- మిగతా 2లో..

## భూభారతి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

( మొదటి పేజీ తరువాయి )

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భూముల రీ సర్వే ప్రక్రియను రెవెన్యూ, సర్వే అధికారులు సమన్వయంతో త్వరగా పూర్తి చేయాలని సూచించారు. సర్వే వివరాలను పట్టాదారులకు ముందుగా తెలియజేసి, వారి సమక్షంలోనే సర్వే నిర్వహించాలని స్పష్టం చేశారు. డిప్యూటీ తహసీల్దార్, సర్వేయర్, జీపీఓలతో బృందాలను ఏర్పాటు చేసి, తహసీల్దార్లు క్షేత్రస్థాయిలో సర్వే ప్రక్రియను పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్డీవోలు శ్రీధర్ బాబు, కేవస్ఏ కుమారి, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ శ్రీనివాస్, తహసీల్దార్లు, లైసెన్స్డ్ సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

## భూముల రీ సర్వేను వేగవంతం చేయాలి

**క్షేత్రస్థాయి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి...**

**కరీంనగర్ జిల్లాలో 70 గ్రామాలు..**

**ఇప్పటివరకు 10 గ్రామాల్లో పూర్తి...**

**30 రోవర్లతో సర్వే..**

**లైసెన్స్డ్ సర్వేయర్లకు ఎప్పటికప్పుడు చెల్లింపులు.....**

**జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా....**

**కరీంనగర్ అక్టోబర్ 23 (మనం బ్యూరో ) :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల రీ సర్వే ప్రక్రియను నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కరీంనగర్ జిల్లాలో ప్రభుత్వం 70 గ్రామాల్లో రీ సర్వే నిర్వహించాలని లక్ష్యంగా నిర్దేశించగా, ఇప్పటివరకు 10 గ్రామాల్లో ప్రక్రియ పూర్తయిందని, మిగిలిన గ్రామాల్లో విడతలవారీగా సర్వే కొనసాగుతోందని తెలిపారు. జిల్లాలో 30 రోవర్ల సహాయంతో రీ సర్వే ప్రక్రియ చేపడుతున్నట్లు వెల్లడించారు.జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం రాత్రి భూముల రీ సర్వే పురోగతి, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలు, భూముల రికార్డుల పరిశీలన, సర్వే--రెవెన్యూ శాఖల సమన్వయం, ఆర్డీవోల పర్యవేక్షణ తదితర అంశాలపై కలెక్టర్ అడిషనల్ కలెక్టర్ రెవెన్యూ శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీవోలు, తహసీల్దార్లతో సమీక్ష నిర్వహించారు.

**విడతలవారీగా రీ సర్వే**

జిల్లాలో రీ సర్వే ప్రక్రియను ప్రణాళికాబద్ధంగా ముందుకు తీసుకెళ్లాలని కలెక్టర్ సూచించారు. ఇప్పటికే 10 గ్రామాల్లో సర్వే పూర్తయిన నేపథ్యంలో మిగిలిన గ్రామాల్లోనూ నిర్దేశిత లక్ష్యాలను చేరుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అందుబాటులో ఉన్న 30 రోవర్లను సమర్థంగా వినియోగిస్తూ సర్వే పనుల్లో వేగం పెంచాలని తెలిపారు.

**శాఖల మధ్య సమన్వయం అవసరం**

సర్వే, రెవెన్యూ శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. మండల స్థాయిలో సర్వే అధికారులు, లైసెన్స్డ్ సర్వేయర్లు, మండల సర్వేయర్లు నిరంతరం సంప్రదింపులు జరుపుతూ ప్రక్రియలో జాప్యం, అడ్డంకులు తలెత్తకుండా చూడాలన్నారు. భూముల రికార్డుల పరిశీలనలో స్పష్టతతో వ్యవహరిస్తూ క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు.

**రైతులకు ముందస్తు సమాచారం**

రీ సర్వే చేపట్టే గ్రామాల్లో రైతులకు ముందుగానే సమాచారం అందించాలని కలెక్టర్ సూచించారు. వ్యవసాయ శాఖ అధికారులు రైతులతో సమన్వయం చేసుకుంటూ వారిని ప్రక్రియలో భాగస్వాములను చేయాలన్నారు. రీ సర్వే ఉద్దేశం, నిర్వహించే విధానం గురించి అవగాహన కల్పించి, రైతుల సహకారంతో ప్రక్రియను పారదర్శకంగా, సజావుగా పూర్తి చేసేందుకు కృషి చేయాలని తెలిపారు.

**సర్వేయర్లకు ఎప్పటికప్పుడు చెల్లింపులు**

రీ సర్వే ప్రక్రియలో కీలకంగా వ్యవహరిస్తున్న లైసెన్స్డ్ సర్వేయర్లకు చెల్లింపులు ఎప్పటికప్పుడు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. సర్వే పనులకు ఆటంకాలు కలగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఆర్డీవోలు, తహసీల్దార్లు మండలాల వారీగా పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ నిర్దేశిత లక్ష్యాలను సాధించాలని స్పష్టం చేశారు. ఈ సమీక్షలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి స్వామి, ఆర్డీవోలు షర్మిల, జలకుమారి, ఏడీ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ కిషన్ రావు, తహసీల్దార్లు, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## రహదారి విస్తరణలో ఇళ్లు కోల్పోయిన అర్హులైన నిర్వాసితులకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయిస్తాం

( మొదటి పేజీ తరువాయి )

హుస్నాబాద్ నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్ల కోసం అర్హుల నుంచి డిమాండ్ ఎక్కువగా ఉన్న నేపథ్యంలో, అత్యంత దయనీయ పరిస్థితుల్లో నివసిస్తున్న వారికి ముందుగా న్యాయం చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రాధాన్యతా క్రమంలో ఇళ్లను కేటాయిస్తోందని పేర్కొన్నారు. అదేవిధంగా గౌరవెల్లి – గండిపల్లి ప్రాజెక్టు నిర్మాణం కారణంగా ఇళ్లు కోల్పోయి, ఇప్పటివరకు ఎలాంటి ఇల్లు పొందని నిర్వాసితుల్లో భూమి ఉండి, ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హత కలిగిన వారికి కూడా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని నిర్ణయించినట్లు మంత్రి వెల్లడించారు. హుస్నాబాద్ చౌటపల్లి వద్ద ఇండస్ట్రియల్ పార్క్ కోసం భూములు ఇచ్చిన వారికి అర్హత ఉండి ఇల్లు లేని వారికి కూడా ఇందిరమ్మ ఇల్లు కేటాయించేలా చర్యలు తీసుకుంటామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

**నిరుపేదలకు సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యం:**

ఇళ్లు లేని నిరుపేదలకు, గుడిసెల్లో జీవనం సాగిస్తున్న కుటుంబాలకు, వివిధ అభివృద్ధి ప్రాజెక్టులు, రహదారి విస్తరణ కారణంగా నివాసాలను కోల్పోయిన అర్హులైన నిర్వాసితులకు న్యాయం చేయాలన్నదే తమ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. అర్హుల సంఖ్య ఎక్కువగా ఉన్నప్పటికీ, అత్యంత అవసరంలో ఉన్న కుటుంబాలకు మొదటి ప్రాధాన్యతనిస్తూ, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా కృషి చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలి



( మొదటి పేజీ తరువాయి )

పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, డీఆర్వో స్వామి, రహదారులు--భవనాలు, రవాణా, ఆర్టీసీ, పోలీస్, వైద్య ఆరోగ్య, మున్సిపల్, జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాలు, ప్రమాదకర ప్రాంతాలు, రహదారుల పరిస్థితి, మరమ్మతుల అవసరం, క్షతగాత్రులకు అందుతున్న వైద్య సేవలపై సమావేశంలో సమీక్షించారు.

**రహదారులపై నిరంతర పర్యవేక్షణ**

ప్రధాన రహదారులపై అధికారులు తరచుగా తనిఖీలు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి, వాటికి గల కారణాలను విశ్లేషించి తగిన నివారణ చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. రహదారులపై గుంతలు, దెబ్బతిన్న ప్రాంతాలను గుర్తించి సీసీ ప్యాచ్ వర్కులు, అవసరమైన మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. ప్రధాన రహదారులకు అనుసంధానంగా ఉన్న అప్రోచ్ రోడ్ల పనులను వేగవంతం చేయడంతో పాటు రద్దీ ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించాలన్నారు.

**నగరంలో సమస్యలకు తక్షణ పరిష్కారం**

కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో సర్కిళ్ల వారీగా తనిఖీలు నిర్వహించి ప్రమాదాలకు ఆస్కారం ఉన్న ప్రాంతాలను గుర్తించాలని కలెక్టర్ సూచించారు. రహదారులపై గుంతలు, పైపులైన్ల లీకేజీల వల్ల ఏర్పడుతున్న సమస్యలను పరిశీలించి మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. ముఖ్యంగా ఎన్టీఆర్ జంక్షన్ నుంచి పద్మానగర్ కూడలి వరకు అవసరమైన రహదారి మరమ్మతులు చేపట్టి వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. రోడ్డు పక్కన ఏర్పాటు చేస్తున్న ఫ్లెక్సీలు, హోర్డింగ్‌ల వల్ల ట్రాఫిక్‌కు ఆటంకం కలగకుండా ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన వాటిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. రహదారుల నిర్వహణ, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, ప్రమాదాల నివారణలో సంబంధిత శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

**ప్రమాద బాధితులకు సత్వర వైద్యం**

రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే క్షతగాత్రులకు సకాలంలో వైద్యసేవలు అందించడం ప్రాణాలను కాపాడటంలో కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు. జాతీయ రహదారులపై ప్రమాద బాధితులకు అందిస్తున్న వైద్యసేవలు, అంబులెన్స్‌ల లభ్యత, అత్యవసర సహాయం కోసం ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నంబర్ల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రమాద బాధితులను త్వరగా ఆసుపత్రులకు తరలించేందుకు అవసరమైన ఏర్పాట్లు పటిష్టంగా ఉండాలని సూచించారు.

**పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి**

రోడ్డు ప్రమాద బాధితులకు అందుబాటులో ఉన్న పీఎం రహవీర్ పథకం, హిట్ అండ్ రన్ పరిహార నిబంధనలు, నగదు రహిత వైద్య చికిత్సపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రమాదం జరిగినప్పుడు బాధితులకు అందుబాటులో ఉన్న సహాయంపై ప్రజలకు స్పష్టమైన సమాచారం ఉండాలన్నారు. పీఎం రహవీర్ పథకం కింద జిల్లాలోని 40 ప్రైవేటు ఆసుపత్రుల్లో రోడ్డు ప్రమాద బాధితులకు వైద్యసేవలు అందిస్తున్నట్లు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు వివరించారు. త్వరలో జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనూ వైద్యసేవలు అందుబాటులోకి తీసుకురావడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

**నిబంధనలు పాటిస్తేనే ప్రమాదాల నియంత్రణ**

పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మాట్లాడుతూ జిల్లాలో రోడ్డు ప్రమాదాలు, ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న ప్రాంతాలు, ఈ-చలాన్లు, హిట్ అండ్ రన్ కేసులకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ వాహనం నడిపేటప్పుడు పూర్తి దృష్టిని డ్రైవింగ్‌పైనే కేంద్రీకరించాలని సూచించారు. అధికారుల చర్యలకు ప్రజల సహకారం తోడైతే రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని సమావేశంలో స్పష్టం చేశారు. రహదారులపై లోపాలను సకాలంలో సరిచేయడం, ప్రమాదకర ప్రాంతాల్లో తగిన భద్రతా ఏర్పాట్లు చేయడం, ప్రమాద బాధితులకు వేగంగా వైద్యం అందించడం ద్వారా ప్రాణనష్టాన్ని తగ్గించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు.

# పే అప్‌గ్రేడేషన్ సర్క్యులర్ విడుదలపై హర్షం

యైటింక్లయిన్ కాలనీ,మనం న్యూస్ అక్టోబర్ 23: తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు మల్లు భట్టి విక్రమార్క జూలై 13న ఇచ్చిన హామీ మేరకు, సింగరేణి అధికారుల దీర్ఘకాలిక న్యాయమైన డిమాండ్ అయిన పే అప్‌గ్రేడేషన్ సర్క్యులర్‌ను దసరా పండుగ సందర్భంగా విడుదల చేయడం పట్ల అఖిల భారత బొగ్గు గనుల అధికారుల సంఘం హర్షం వ్యక్తం చేస్తోంది. శుక్రవారం స్థానిక ఎన్ సి ఓ ఏ క్లబ్ లో జరిగిన విలేకరుల సమావేశంలో అధికారుల సంఘం అధ్యక్షుడు లక్ష్మీపతి గౌడ్ మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్నూ్రా్రా చెల్లింపుల కోసం సింగరేణి యాజమాన్యానికి ఆదేశాలు ఇస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రివర్యులు ప్రకటించడం అధికారుల్లో ఆశలు నింపింది. ఈ రెండు కీలక అంశాలపై సానుకూలంగా స్పందించిన తెలంగాణ ప్రభుత్వానికి, సింగరేణి యాజమాన్యానికి మా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము. ఈ సానుకూల పరిణామానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేయడం మా బాధ్యతగా భావిస్తున్నాము. ప్రభుత్వ పెద్దలకు, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు సింగరేణి అధికారుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి సహకరించి, వారి ఆకాంక్షలకు అండగా నిలిచిన తెలంగాణ రాష్ట్ర గౌరవ ముఖ్యమంత్రివర్యులు రేవంత్ రెడ్డి, కోల్ బెల్ట్ ప్రాంత మంత్రివర్యులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు,వివేక్ వెంకటస్వామి, రామగుండం శాసనసభ్యులు మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ కోల్ బెల్ట్ ప్రాంతంలోని గౌరవ శాసనసభ్యులందరికీ, ఇతర ప్రజాప్రతినిధులందరికీ సింగరేణి అధికారుల సంఘం తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజే స్తున్నాము. సింగరేణి యాజమాన్యానికి, బోర్డు సభ్యులకు ధన్యవాదాలు

సింగరేణి అధికారుల సమస్యల పరిష్కారానికి సహకరించిన సంస్థ చైర్మన్ ఢ మేనేజింగ్ డైరెక్టర్ జ్యోతి బుద్ధ ప్రకాశ్, ఐఏఎస్, డైరెక్టర్ గౌతమ్ పోత్రు, ఐఏఎస్,డైరెక్టర్ ఎల్.వి. సూర్యనారాయణ,డైరెక్టర్ కె. వెంకటేశ్వర్లు డైరెక్టర్ ఎం. తిరుమల రావు మా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజే స్తున్నాము. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరపున బోర్డు సభ్యులుగా ఉన్న నవీన్ మిట్టల్ ఐఏఎస్, సందీప్ కుమార్ సుల్తానియా, ఐఏఎస్, కేంద్ర ప్రభుత్వం తరపున బోర్డు సభ్యులుగా ఉన్న సంజీవ్ కుమార్ కస్సీ, డాక్టర్ హేమంత్ శరద్ పాండే, అలోక్ కుమార్ సింగ్ ఈ ప్రక్రియలో అందించిన సహకారానికి




హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము.

**సంఘీభావం తెలిపిన ప్రతి ఒక్కరికీ ప్రత్యేక కృతజ్ఞతలు**

కోల్ మైన్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ సింగరేణి చేపట్టిన నిరంతర ప్రయత్నాలకు మద్దతుగా నిలిచిన అన్ని కార్మిక సంఘాల, ప్రజా సంఘాల నాయకులకు, వివిధ రాజకీయ పార్టీల నాయకులకు, ప్రజాప్రతి నిధులకు, అలాగే మా సమస్యలను ప్రజల దృష్టికి తీసుకెళ్లి సహకరించిన ప్రెస్ మరియు మీడియా ప్రతినిధులందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజే స్తున్నాము. మిగిలిన సమస్యల పరిష్కారంపై మా ఆశాభావం

పే అప్‌గ్రేడేషన్ సర్క్యులర్ విడుదల కావడం సింగరేణి అధికారుల సుదీర్ఘ నిరీక్షణకు లభించిన సానుకూల ఫలితం. ఇది అధికారుల న్యాయమైన డిమాండ్‌కు గుర్తింపు లభించిన ముఖ్యమైన పరిణామం. దసరా పండుగ సందర్భంగా ఈ సర్క్యులర్ విడుదల కావడం అధికారుల్లో ఆనందాన్ని నింపింది. అదేవిధంగా, గత మూడు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న పి ఆర్ పి చెల్లింపులపై గౌరవ ఉప ముఖ్యమంత్రివర్యులు చేసిన ప్రకటనను స్వాగతి స్తున్నాము. ఈ ప్రకటనకు అనుగుణంగా అవసరమైన ప్రక్రియను పూర్తి చేసి, పి ఆర్ పి చెల్లింపులను వీలైనంత త్వరగా అమలు చేయాలని సింగరేణి యాజమాన్యాన్ని వినమ్రంగా కోరుతున్నాము. అలాగే, అధికారులకు సంబంధించిన ఇతర పెండింగ్ సమస్యలను కూడా తెలంగాణ ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం సానుకూలంగా పరిశీలించి, త్వరితగతిన పరిష్కరిస్తాయని ఆశిస్తు న్నాము. బొగ్గు ఉత్పత్తి,రవాణా పెంపునకు అధికారుల సమష్టి కృషి అవసరం ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావం కారణంగా బొగ్గు సరఫరా మరియు విద్యుత్ అవసరాలపై ఒత్తిడి పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో, దేశ ఇంధన భద్రతలో సింగరేణి సంస్థ పోషించే పాత్ర మరింత కీలకమవుతుంది. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని, సింగరేణి అధికారులుగా బొగ్గు ఉత్పత్తి మరియు రవాణాను పెంచడం మనందరి ముఖ్యమైన బాధ్యత. భద్రతా ప్రమాణాలను పాటిస్తూ, అందుబాటులో ఉన్న వనరులను సమర్థవంతంగా వినియో గించుకొని, ఉత్పత్తి మరియు రవాణా లక్ష్యాలను సాధిం చేందుకు అధికారులు, ఉద్యోగులు సమష్టిగా కృషి చేయాలి. సంస్థ అభివృద్ధి, రాష్ట్ర విద్యుత్ అవసరాల తీర్చడం, దేశ ఇంధన భద్రతకు తోడ్పడడం అనే లక్ష్యాలతో ప్రతి అధికారి తన వంతు బాధ్యతను నిబద్ధతతో నిర్వర్తించాలని కోరుతున్నాము. సింగరేణి అభివృద్ధి చెందితేనే రాష్ట్ర ప్రగతికి మరింత బలం చేకూరుతుంది. అధికారుల సంక్షేమం మరియు సంస్థ అభివృద్ధి పరస్పరం అనుసంధానమై ఉన్నాయని మేము విశ్వసిస్తున్నాము.

ఐకమత్యమే మన బలం సమష్టి కృషే మన విజయం

ఈ సానుకూల పరిణామం సింగరేణి అధికారుల ఐకమత్యానికి, నిరంతర కృషికి, ప్రజాప్రతినిధుల చొరవకు, ప్రభుత్వ సహకారానికి, సింగరేణి యాజమాన్యం సానుకూల స్పందనకు నిదర్శనం. అధికారుల న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం అధికారుల సంఘం ఎల్లప్పుడూ నిర్మాణాత్మకంగా, బాధ్యతాయుతంగా కృషి చేస్తుంది. అధికారుల సంక్షేమంతో పాటు సంస్థ అభివృద్ధికి కూడా సంఘం తన వంతు సహకారాన్ని అందిస్తుందని తెలియజేస్తున్నాము.

ఈ సానుకూల పరిణామానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన ప్రతి ఒక్కరికీ మరోసారి మా హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఇది కేవలం ఒక డిమాండ్ సాధించిన విజయం మాత్రమే కాదు,సింగరేణి అధికారుల ఐకమత్యానికి, నిరంతర కృషికి చేసినట్లయితే మిగతా సమస్యలు కూడా పరిష్కారం అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ విలేకరుల సమావేశంలో జనరల్ సెక్రటరీ పెద్ది నర్సింహులు వైస్ ప్రెసిడెంట్, బీఈసీ - పొనుగంటి శ్రీనివాస్ ఆర్జీ–2 ప్రెసిడెంట్ - రాముడు ఆర్జీ–2 ఏరియా సెక్రటరీ - సంజీవ్ కుమార్ వైస్ ప్రెసిడెంట్ -జనార్ధన్ ట్రెజరర్ - విశాల్ జాయింట్ ట్రెజరర్ - భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## హిందూ సంస్కృతి రక్షణకే అలయ్ బలయ్



బెల్లంపల్లి అక్టోబర్ 22 (మనం న్యూస్) : హిందూ సంస్కృతి రక్షణకే అలయ్ బలయ్ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని బిజెపి రాష్ట్ర నేత, కాంటెస్టెడ్ ఎమ్మెల్యే కొయ్యల ఏమాజి అన్నారు. ఈ రోజు బెల్లంపల్లి పట్టణంలోని అగర్వాల్ భవన్ లో బిజెపి రాష్ట్ర నేత కొయ్యల ఏమాజి ఆధ్వర్యంలో అలయ్ బలయ్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ హిందూ ధర్మ రక్షణ, సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. బెల్లంపల్లి పట్టణంలో మొదటి సారి ఈ కార్యక్రమం నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. బిజెపి సీనియర్ నేత, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ ను స్ఫూర్తిగా తీసుకొని ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో అన్ని వర్గాలు, కులాలు, మతాలు, పార్టీలు, సంఘాలను కలుపుకొని అలయ్ బలయ్ కార్యక్రమం ఘనంగా నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అతిథులకు కండువాలు కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు బొల్లెడ్ల కేశవరెడ్డి, ఎఫ్ సి ఐ సభ్యులు పులగం తిరుపతి, తాండూరు మండల అధ్యక్షుడు భరత్ కుమార్, జిల్లా కౌన్సిల్ సభ్యులు శనిగారపు శ్రావణ్, ఓ బి సి మోర్చ జిల్లా ఉపాధ్యక్షులు రామయ్య యాదవ్, గోవర్ధన్,జిల్లా కార్యదర్శి ఆకుల శంకర్, ఎస్సీ మోర్చ జిల్లా ఉపాధ్యక్షులు నర్సింగ్, కల్లేపల్లి నవీన్, యుగంధర్, గణేష్, రాజ్కుమార్, రాములు, స్వామి, రాజేశం తదితరులు పాల్గొన్నారు.

## మంథని బస్టాండ్ ముందు షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి మంత్రులకు వినతిపత్రం అందజేత

మంథని అక్టోబర్23 (మనం న్యూస్) : మంథని పట్టణంలోని బస్టాండ్ ముందు రోడ్డు వెడల్పు లో భాగంగా చిరు వ్యాపారులకు సంబంధించిన షాపింగ్ కాంప్లెక్స్ పోతున్నందున అట్టి షాపింగ్ కాంప్లెక్స్ ను తిరిగి నిర్మించడానికి ఆర్టీసీ బస్టాండ్ కు సంబంధించిన కొంత స్థలాన్ని కేటాయించాలని కోరుతూ మంథని మున్సిపల్ చైర్మన్ వోడ్నాల శ్రీనివాస్, మున్సిపల్ వైస్ చైర్మన్ ముస్కుల సహేందర్ రెడ్డి, మున్సిపల్ పాలకవర్గ సభ్యులు ఎల్లెంకి వంశీధర్ తో కలిసి రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్,తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టిసి)ఎండీ వై.నాగిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంథని పట్టణంలోని బస్టాండ్ ముందు షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం ఆవశ్యకతను వారి దృష్టికి తీసుకెళ్లారు. మంథని పట్టణం రోజురోజుకు అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో,బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో ప్రయాణికులు, వ్యాపారులు,పట్టణ ప్రజలకు అవసరమైన సదుపాయాలను మెరుగుపరచాల్సిన అవసరం ఉందని వివరించారు. ఈ ప్రాంతంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టడం ద్వారా వ్యాపార కార్యకలాపాలకు అనుకూలమైన వసతులు కల్పించడంతో పాటు, పట్టణ వాణిజ్య అభివృద్ధికి మరింత ప్రోత్సాహం లభిస్తుందని పేర్కొన్నారు. అలాగే,షాపింగ్ కాంప్లెక్స్ అందుబాటులోకి వస్తే రోడ్డు విస్తరణలో భాగముగా



షాపులు కోల్పోతున్న స్థానిక వ్యాపారులకు తిరిగి దుకాణా లు ఏర్పాటు చేసుకునే అవకాశం కలుగుతుందని, ప్రయాణికులకు, ప్రజలకు సౌకర్యవంతముగా ఉంటుందని వివరించారు. ఈ నిర్మాణం ద్వారా బస్టాండ్ పరిసర ప్రాంతాల అభివృద్ధికి, స్థానికంగా ఉపాధి అవకాశాల పెంపునకు కూడా దోహదపడే అవకాశం ఉందని తెలిపారు. మంథని పట్టణ సమగ్ర అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని, బస్టాండ్ ముందు షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి అవసరమైన అనుమతులు, నిధులు,ఇతర సంబంధిత చర్యలపై పరిశీలన జరిపి,నిర్మాణ పనులు చేపట్టేందుకు సహకరించాలని మంత్రులు,ఆర్టీసీ ఎండీని వారు కోరారు. మంథని పట్టణ అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా ఈ ప్రతిపాదనను పరిగణనలోకి తీసుకొని,ప్రజలకు మరియు వ్యాపార వర్గాలకు ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

# అదిల్ పేట్‌లో 'ఖేత్ బచావో అభియాన్' కార్యక్రమం



మందమర్రి, అక్టోబర్ 23:(మనం న్యూస్) అదిల్ పేట గ్రామపంచాయతీ కార్యాలయంలో "ఖేత్ బచావో అభియాన్" కార్యక్రమాన్ని వ్యవసాయ శాఖ నిర్వహించింది. శుక్రవారం మందమర్రి మండలంలోని ఆదిల్ పేట గ్రామపంచాయతీ కార్యాలయంలో ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమానికి చెన్నూర్ సహాయ వ్యవసాయ సంచాలకులు భాను ప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని రైతులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బానోత్ ప్రసాద్ మాట్లాడుతూ , లి"వ్యవసాయాన్ని రక్షిద్దాం" అనే నినాదంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందనీ ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్యంగా రైతులకు వ్యవసాయాన్ని రక్షించడం అంటే సహజ ఎరువుల వినియోగాన్ని ప్రోత్సహించడం, నేల ఆరోగ్యాన్ని మెరుగుపరచడం, నీరు, ఇతర వనరులను పరిరక్షించడం, సుస్థిర పోషక యాజమాన్యాన్ని వేగవంతం చేయడం, సహజ వ్యవసాయాన్ని అవలంబించేలా రైతులను ప్రోత్సహించడం ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యాలు అని చెన్నూర్ వ్యవసాయ సంచాలకులు బానోతు ప్రసాద్ పేర్కొన్నారు. భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు, ఇతర వ్యవసాయ ఉత్పాదకాల సమతుల్య వినియోగాన్ని ప్రోత్సహించడం ద్వారా సేద్యాన్ని కాపాడుకోవచ్చని ఆయన తెలిపారు. నూనెగింజలు, పప్పుధాన్యాలు, ఉద్యాన పంటల ద్వారా పంటల వైవిధ్యీకరణను ప్రోత్సహించాలని బానోతు ప్రసాద్ కోరారు. వరి కోత అనంతరం ఖాళీగా ఉండే భూముల సమర్థ వినియోగం, పంట అవశేషాల సుస్థిర నిర్వహణ, పంట వ్యర్థాల దహనాన్ని నిరుత్సాహపరచడం ద్వారా భూసారాన్ని రక్షించడం వ్యవసాయాన్ని రక్షించడమేనన్నారు . సేంద్రియ, జీవ ఉత్పత్తుల వినియోగం, ప్రకృతి సేద్యంపై రైతులకు అవగాహన, శిక్షణ, క్షేత్ర ప్రదర్శనలు నిర్వహించి రైతులకు అవగాహన కల్పించడం ద్వారా వ్యవసాయాన్ని రక్షించవచ్చని ఆయన అన్నారు.

**"పర్ డ్రాప్ మోర్ క్రాప్"**

నీటి సంరక్షణ, భూగర్భ జలాల పునరుద్ధరణ, వర్షపు నీటి సేకరణ, "పర్ డ్రాప్ మోర్ క్రాప్" కార్యక్రమంపై అవగాహన కల్పించడం. సమగ్ర పోషక యాజమాన్యం, సమగ్ర సస్యరక్షణ, వాతావరణ మార్పులను తట్టుకునే వ్యవసాయం, సుస్థిర వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడం కూడా వ్యవసాయాన్ని రక్షించడమేనని ఆయన పేర్కొన్నారు. భూసార కార్డుల వినియోగం, ఎరువుల విక్రయాలకు సంబంధించిన నిబంధనలపై అవగాహన కల్పించడం జరుగుతుంది అని తెలిపారు. వాతావరణంలో ఎల్ నినో కారణంగా రాబోవు యాసంగి లో వరి కి బదులు ఆరుతడి పంటలు వేసుకోవాలని రైతులకు సూచించారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి జి. కిరణ్మయి, వ్యవసాయ విస్తరణ అధికారి ఎం. రాజశేఖర్, ఎస్. కనకరాజు, సర్పంచ్ నెండుగురి పున్నం, కృషి సఖిలు వసంత, లిఖిత, రైతులు పాల్గొన్నారు.

# టీజేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కంతి మోహన్ రెడ్డి నియామకంపై ఇబ్రహీంపట్నంలో ఘన సన్మానం



ఇబ్రహీంపట్నం అక్టోబర్ 23 (మనం న్యూస్):తెలంగాణ జనసమితి (టీజేఎస్) పార్టీ రాష్ట్ర రైతు విభాగం అధ్యక్షుడిగా సేవలందిస్తూ, పార్టీ బలోపేతానికి విశేష కృషి చేసిన కంతి మోహన్ రెడ్డిని పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం.. రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించడం పట్ల పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం ఇబ్రహీంపట్నంలోని కొత్త బస్‌స్టాండ్ ప్రాంతంలో ఆయన స్వగ్రామ ప్రజలు, టీజేఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మరియు వివిధ కుల సంఘాల పెద్దల ఆధ్వర్యంలో ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు నాయకులు మాట్లాడుతూ.. కంతి మోహన్ రెడ్డి ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ, రైతుల సంక్షేమం కోసం అంకితభావంతో పని చేస్తున్నారని కొనియాడారు. అలాంటి నాయకుడికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పదవి దక్కడం పార్టీకి, ముఖ్యంగా ఇబ్రహీంపట్నం ప్రాంతానికి గర్వకారణమని పేర్కొన్నారు.

**ప్రజా సమస్యల పరిష్కారమే నా ప్రథమ కర్తవ్యం: కంతి మోహన్ రెడ్డి**

ఈ సన్మాన సభలో టీజేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కంతి మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రొఫెసర్ కోదండరాం గారి మార్గదర్శకత్వంలో తెలంగాణ జనసమితి పార్టీ ఎప్పుడూ పేదలు, రైతులు, బలహీన వర్గాల హక్కుల సాధన కోసం ముందుంటుందని స్పష్టం చేశారు. తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించిన పార్టీ రాష్ట్ర నాయకత్వానికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా ప్రజా సమస్యల పరిష్కారం, రైతుల సంక్షేమం, సామాజిక న్యాయం కోసం మరింత కష్టపడి పనిచేస్తానని, తన రాజకీయ ప్రయాణం ఎల్లప్పుడూ సామాన్య ప్రజల పక్షానే ఉంటుందని తేల్చిచెప్పారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ఆయన పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు.

**పాల్గొన్న ప్రముఖులు**

ఈ కార్యక్రమంలో తెలంగాణ జనసమితి పార్టీ జిల్లా కార్యదర్శి చింతకుంట శంకర్, విద్యార్థి విభాగం రాష్ట్ర నాయకులు జిల్లపెల్లి దిలీప్ కుమార్, మండల పార్టీ అధ్యక్షులు కంతి రమేష్, గ్రామ శాఖ అధ్యక్షులు ఏశాల గంగా రెడ్డి, రెబ్బటి మల్లయ్య యాదవ్, నందగోపాల్, గజ్జ రాజేందర్, కసుక కృష్ణ, గంగాధర్, చిన్నయ్య, గూడా రాజారెడ్డి, కాట దశరథ్ రెడ్డి, పెద్దబోయిన రమేష్, గడ్డమీద నరేందర్, బద్ది రాములు, కంతి మోసే, సంజీవ్, కంతి కరుణాకర్, గజ్జ రాజశేఖర్, ఎండీ సలీం, సిరాజ్, కనక మహేష్ పాల్గొన్నారు.

# పూర్వ విద్యార్థుల సమ్మేళనం



రాయికల్, అక్టోబర్ 23 (మనం న్యూస్) : రాయికల్ పట్టణంలోని వీఎస్ గార్డెన్‌లో శుక్రవారం వివేకవర్ధిని హైస్కూల్ 2005--06 విద్యా సంవత్సరానికి చెందిన పదవ తరగతి బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. 20 ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు పాత జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను పూలమాలలు, శాలువాలు, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఆటపాటలతో సందడి చేస్తూ పాఠశాల నాటి మధుర జ్ఞాపకాలను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కైరం సత్యం, ఉపాధ్యాయులు గాజంగి రాజేశం, భోగ రాజేశం, కట్కం భూమేశ్వర్, రాంగోపాల్, వెంకటేశ్వర్లు, కుందా రవ్ శ్రీనివాస్, ఇల్లేందుల శ్రీనివాస్‌తో పాటు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

# దరఖాస్తులకు ఆహ్వానం



మంథని అక్టోబర్ 23 (మనం న్యూస్) తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలకళాశాల (బాలుర) పీఎంశ్రీ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు ఐదు నెలల పాటు బోధించేందుకు గెస్ట్ స్పెషల్ నీడ్స్ ఎడ్యుకేటర్స్ తాత్కాలిక పద్ధతిలో నియమించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఊటూరి శ్రీనాథ్ తెలిపారు. సోషల్ వెల్ఫేర్ గురుకుల విద్యాలయం (మంథని)లో ఖాళీ ఉన్న పోస్టును భర్తీ చేయనున్నట్లు ఆయన వివరించారు.అర్హత గల అభ్యర్థులు ఈ నెల26వ తేదీలోగా మంథని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల(బాలుర) ప్రిన్సిపాల్ ను సంప్రదించి దరఖాస్తులను అందజేయాలని సూచించారు. ఎడ్యుకేటర్కు నెలకు రూ.16,500 గౌరవ వేతనంఅందజేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. సంబంధిత పోస్టుకు అర్హత స్పెషల్ ఎడ్యుకేషన్ లో బీఈడీ లేదా బీఈడీ జనరల్ విత్ వన్ ఇయర్ డిప్లమా ఇన్ స్పెషల్ ఎడ్యుకేషన్ ఉండాలని ఆయన వివరించారు.

# రేణుక ఎల్లమ్మ దేవాలయం ఆవరణలో మొక్కలు నాటిన ప్రకృతి ప్రేమికులు కృష్ణమూర్తి

మంథని అక్టోబర్ 23 (మనం న్యూస్) ప్రకృతికి ఎంత ఎక్కువ సహకరిస్తే అది అంత మేలు చేస్తుందని చెబుతున్నారు మంథని పట్టణానికి చెందిన విశ్రాంత ఉద్యోగి గట్టు కృష్ణమూర్తి. మంథనిలో ఎక్కడ ఖాళీ స్థలం కనిపించిన అక్కడ మొక్కలు వెలువడడంతో కృష్ణమూర్తి ప్రకృతి ప్రేమికుడుగా పేరొందినాడు.ఈ నేపథ్యంలో మంథని పట్టణములోని రేణుక ఎల్లమ్మ దేవాలయం ఆవరణలో శుక్రవారం గౌడ సంఘం నాయకులు,గౌడ కుల పెద్దల ఆధ్వర్యంలో గట్టు కృష్ణమూర్తి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలను నాటడంతో పాటు వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని ఆయన కోరారు. పచ్చదనాన్ని పెంపొందించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని ఆయన సూచించారు. ఇంటి పరిసరాల్లో కూడా మొక్కలను పెంచడం వల్ల ఆనాధకరమైన వాతావరణం ఏర్పడుతుందన్నారు. మంథని పట్టణమును పచ్చదనమూతో నిండిన పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రజలందరూ ముందుకు వచ్చి మొక్కలను నాటాలని ఆయన పిలుపునిచ్చారు.



# ప్రమాదవశత్తు మానేరులో పడి పంచాయతీ కార్యదర్శి మృతి

మంథని అక్టోబర్23 (మనం న్యూస్) మానేరు నది గుంతలో పడి ప్రమాదవశాత్తు మంథని మండలం సూరయ్యపల్లి గ్రామానికి చెందిన పంచాయతీ కార్యదర్శి జైపాల్ ప్రమాద వశత్తు మృతిచెందారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం సూరయ్యపల్లి పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న శనిగరపు జయపాల్ రత్నాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని ఎక్స్ రోడ్ పెట్రోల్ బంకు ఎదురుగా నివాసం ఉంటున్నారు. ఆయన భార్యతో కలిసి టేకుమట్లలోని అత్తగారింటికి వెళ్లి తిరిగి వస్తుండగా ఓడేడు మానేరు వద్దకు చేరుకున్నారు. మానేరులో స్నానం చేద్దామని నిర్ణయించుకున్న భార్యాభర్తలు తమ పిల్లలను కూర్చుండబెట్టి వారు మానేరు నదిలోకి స్నానం ఆచరిస్తుండగా ప్రమాదవశత్తు ఒక్కసారిగా ట్రాక్టర్లు తీసిన ఇసుక గుంతలో పడి కూరుకుపోవడంతో జైపాల్ అక్కడికక్కడే మృతి చెందాడు. అక్కడ ఉన్న కొందరు వ్యక్తులు వారిని గమనించి మునిగిపోతున్న మృతుని భార్యను పైకి తీసుకువచ్చి ముటాబుట్టిన ఆసుపత్రి తొలగించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

**మృతుడు జైపాల్ కుటుంబానికి సంతాపం**

మంథని మండలం సూరయ్యపల్లి పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న జైపాల్ ప్రమాదవశత్తు మానేరు నదిలో గుంతలో పడి మృతి చెందగా మృతుని కుటుంబ సభ్యులను గ్రామ సర్పంచ్ ఆర్ల నాగరాజు, ఉపసర్పంచ్ ఆరెల్లి సూచిత వరుణ్ గౌడ్, పాలకవర్గ సభ్యులు కలిసి పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు

# మత్తులో మోసం చేశారు

**-ఎవ్వరిని వదిలిపెట్టం.**
**- చచ్చేవరకు ఎమ్మెల్యే వెంటే ఉంటాను.**
**-కిడ్నాప్ చేశారంటూ ఆరోపణ**
**-కిడ్నాప్ గురించి విలేకరుల సమావేశంలో అంకతి శ్రీనివాస్ ఆవేదన**



లక్షెట్టిపేట, అక్టోబర్ 23(ప్రజాజ్యోతి) : నాకు నాలుగు బీర్లు తాగించి, నన్ను బెదిరించి జగన్ మోహన్ రావు వర్గంలో చేర్చుకున్నారని జిల్లా ఆర్టీఏ మెంబర్ అంకతి శ్రీనివాస్ విలేకరుల సమావేశంలో ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం రాత్రి కాంగ్రెస్ నాయకులు స్థానిక ఐబీ లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తనకు బలవంతంగా 4 బీర్లు తాగించి, కిడ్నాప్ చేశారన్నారు. హైదరాబాద్ కు తీసుకుని వెళ్ళుతుండగా మార్గమధ్యంలో తాను ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావుకు కాల్ చేయగా, తనను ఎమ్మెల్యే రక్షించినట్లు వివరించారు. తాను బ్రతికి ఉన్నంత వరకు ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావుతోనే ఉంటానని వెల్లడించారు. అనంతరం మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్ మాట్లాడుతూ ప్రేమ్ సాగర్ రావును మానసికంగా దెబ్బ తీయాలనే ధోరణితో నియోజకవర్గంలో కొందరు కుట్రలు చేస్తున్నారన్నారు. జిల్లా ఆర్టీఏ మెంబర్ అంకతి శ్రీనివాస్ అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని కిడ్నాప్ చేశారన్నారు. ప్రతి ఒక్కరికి పదవులు రావడానికి ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు చేసిన కృషి మరచిపోయారని మండిపడ్డారు. మా నాయకులు, కార్యకర్తల జోలికి వస్తే బాగుండదని హెచ్చరించారు. మీకు దమ్ము, ధైర్యం ఉంటే రండి చూసుకుందాం అని సవాల్ విసిరారు. అంతేకాకుండా జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, రాష్ట్ర అధ్యక్షులు ఈ చీలికల వ్యవహారాన్ని పట్టించుకోవడం లేదని వాపోయారు. బీజేపీ,బీఆర్ఎస్ ల సహకారంతోనే కాంగ్రెస్ పార్టీని చీల్చుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం నాయకులు స్థానిక పోలీస్ స్టేషన్ లో శ్రీనివాస్ ను కిడ్నాప్ చేసిన పలువురి పైన ఫిర్యాదు చేశారు. ఈ సమావేశంలో జెండా వెంకటాపూర్ సహకార సంఘం చైర్ పర్సన్ చల్లా నాగభూషణం, మంచిర్యాల, లక్షెట్టిపేట వ్యవసాయ మార్కెట్ కమిటీల చైర్మన్లు రామగిరి బానేష్, అక్కల వెంకటేశ్వర్లు, ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షులు పూదరి తిరుపతి, నాయకులు త్రిమూర్తి, షాహిద్ అలీ, ఆరీఫ్, పింగళి రమేష్, నర్సయ్య, వెంకటస్వామి గౌడ్, పూర్ణ చందర్ రావు, నలిమేల రాజు,బానేష్, వెంకటేష్,సందెల సురేష్, గోప రమేష్, సురేష్ నాయక్, ముత్రం జా తదితరులు పాల్గొన్నారు.

# రూ.25 లక్షలు ఖర్చు చేసినా.. సౌకర్యాలు కరువు..!

**సద్దుల బతుకమ్మ ఏర్పాట్లలో మున్సిపాలిటీ వైఫల్యం...?**

**ప్రజాధనం ఖర్చుపై ప్రశ్నిస్తున్న పట్టణ ప్రజలు...**



జమ్మికుంట, అక్టోబర్ 23 (మనం న్యూస్): సద్దుల బతుకమ్మ వేడుకల కోసం రూ.25 లక్షలు కేటాయించినా.. మహిళలకు, ప్రజలకు సరైన సౌకర్యాలు కల్పించడంలో జమ్మికుంట మున్సిపాలిటీ విఫలమైందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. భారీగా నిధులు కేటాయించినప్పటికీ, క్షేత్రస్థాయిలో అవసరమైన ఏర్పాట్లు సక్రమంగా లేకపోవడంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం.

**కేటాయింపులు ఘనం.. ఏర్పాట్లు అంతంతే..!**

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ వేడుకలకు మహిళలు పెద్ద సంఖ్యలో హాజరవుతారు. ఇలాంటి కీలకమైన పండుగ కోసం మున్సిపాలిటీ రూ.25 లక్షలు కేటాయించినప్పటికీ, ప్రజలకు అవసరమైన సౌకర్యాలు కల్పించడంలో లోపాలు ఉన్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా జమ్మికుంట డిగ్రీ కళాశాల మైదానంలో ఏర్పాట్లపై పలువురు ప్రశ్నిస్తున్నారు. సౌండ్ సిస్టం ఇబ్బందికరంగా ఉందని తాము ఎంతో ఇష్టంగా వేడుకల్లో పాల్గొనేందుకు రాగా బతుకమ్మ పాటలకు మధ్యల మధ్యలో అంతరాయం కలిగించారని దీంతో తాము ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొనలేకపోయామని పలువురు మహిళలు పేర్కొన్నారు. కళాశాల ముఖద్వారాల వద్ద సరైన లైటింగ్స్ సౌకర్యం కూడా ఏర్పాటు చేయలేదన్నారు. నాయిని చెరువు వద్ద చేసిన ఏర్పాట్లలో అనేక లోపాలు ఉన్నాయని లైటింగ్ సౌకర్యం కల్పించడంలో లోపాలను నిరసిస్తూ కాంగ్రెస్ నాయకులు స్టేజి వద్దనే ఆందోళనకు దిగి నిరసన వ్యక్తం చేశారు. మొత్తంగా నిధుల కేటాయింపు ఒకవైపు.. క్షేత్రస్థాయిలో ఏర్పాట్లు మరోవైపు అన్నట్లుగా పరిస్థితి ఉందనే విమర్శలు పట్టణ ప్రజల నుండి వెల్లువెత్తుతున్నాయి.

**అసలు ఖర్చు ఎంత..? పనులు ఎక్కడ..?**

రూ.25 లక్షల నిధులను ఏయే పనుల కోసం కేటాయించారు..? పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్ దీపాలు, మహిళలకు అవసరమైన సౌకర్యాలు, బతుకమ్మ నిమజ్జన ప్రాంతాల వద్ద ఏర్పాట్ల కోసం ఎంత ఖర్చు చేశారు..? ఆయా పనులను ఎవరు చేపట్టారు..? వాటి నాణ్యతను ఎవరు పరిశీలించారు..? అనే ప్రశ్నలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. ప్రజాధనంతో నిర్వహించే పండుగల సందర్భంగా ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం మున్సిపాలిటీ బాధ్యత. నిధులు కేటాయించామని చెప్పుకోవడం కంటే, వాటికి తగిన ఫలితాలు ప్రజలకు అందాయా లేదా అన్నదే కీలకం. ఏర్పాట్లలో లోపాలు ఉంటే వాటిని గుర్తించి, బాధ్యుల నుంచి వివరణ తీసుకోవాల్సిన అవసరం ఉందని పట్టణ ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

**విచారణ జరిపితేనే వాస్తవాలు వెలుగులోకి..!**

సద్దుల బతుకమ్మ ఏర్పాట్ల కోసం కేటాయించిన రూ.25 లక్షల వినియోగంపై సమగ్రంగా పరిశీలన జరిపి, పనుల వారీగా ఖర్చుల వివరాలను ప్రజలకు వెల్లడించాలని స్థానికులు కోరుతున్నారు. కేటాయించిన నిధులకు, వాస్తవంగా జరిగిన పనులకు మధ్య వ్యత్యాసం ఉందా..? నిబంధనల ప్రకారం పనులు పూర్తయ్యాయా..? అనే అంశాలపై విచారణ జరిగితే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. పండుగల పేరుతో నిధులు కేటాయించడం మాత్రమే కాదు.. ప్రజలకు అవసరమైన సౌకర్యాలు కల్పించడం కూడా అంతే ముఖ్యం. రూ.25 లక్షల ఖర్చుపై స్పష్టత ఇచ్చి, ఏర్పాట్లలో లోపాలు ఉంటే బాధ్యత వహించాల్సిన అధికారులపై చర్యలు తీసుకోవాలని మున్సిపల్ పరిధిలోని ప్రజలు కోరుతున్నారు.

# బీజేపీ సిద్దిపేట జిల్లా అధికార ప్రతినిధిగా పొన్నం శ్రీనివాస్ నియామకం

చిగురుమామిడి: అక్టోబర్ 23) మనం న్యూస్) : భారతీయ జనతా పార్టీ సిద్దిపేట జిల్లా అధికార ప్రతినిధిగా చిగురుమామిడి మండల కేంద్రానికి చెందిన పొన్నం శ్రీనివాస్ నియమితులయ్యారు.కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్,మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావు ఆశీస్సులతో,తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతను అప్పగించిన సిద్దిపేట జిల్లా అధ్యక్షులు బైరి శంకర్ ముదిరాజ్ కు పొన్నం శ్రీనివాస్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ఈ నియామకానికి సహకరించి,ప్రోత్సాహం అందించిన సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి ఖమ్మం వెంకన్న,కరీంనగర్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ ప్రవీణ్ రావు,హుస్నాబాద్ నియోజకవర్గ కన్వీనర్ గుర్రాల లక్ష్మారెడ్డి,మాజీ బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డి,బీజేపీ కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షులు దుర్శెట్టి సంపత్, బీజేపీ చిగురుమామిడి మండల అధ్యక్షులు పోలోజు సంతోష్‌లకు శ్రీనివాస్ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.ఈ సందర్భంగా పొన్నం శ్రీనివాస్ మాట్లాడుతూ తనపై పార్టీ ఉంచిన నమ్మకాన్ని బాధ్యతగా భావిస్తూ,జిల్లా అధ్యక్షులు బైరి శంకర్ ముదిరాజ్ సూచనలు, మార్గదర్శకత్వంలో పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తానని తెలిపారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్తానని,పార్టీ సిద్ధాంతాలను ప్రజలకు చేరవేస్తూ కార్యకర్తలకు అండగా ఉంటానని పేర్కొన్నారు.పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు,ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.హుస్నాబాద్ నియోజకవర్గంలో భారతీయ జనతా పార్టీని మరింత బలోపేతం చేసి,రాబోయే రోజుల్లో కాషాయ జెండా ఎగురవేయడమే తన లక్ష్యమని పొన్నం శ్రీనివాస్ స్పష్టం చేశారు.తనకు అప్పగించిన బాధ్యతను చిత్తశుద్ధితో నిర్వర్తిస్తూ,పార్టీ అభివృద్ధికి, ప్రజాసేవకు తన శక్తివంచన లేకుండా కృషి చేస్తానని వెల్లడించారు.శ్రీనివాస్ నియామకం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.



# హుస్నాబాద్ ఆలోచనకు ఢిల్లీ సలాం!

## స్టీల్ బ్యాంక్ చొరవను అభినందించిన కేంద్ర మంత్రి భూపేందర్ యాదవ్

చిగురుమామిడి అక్టోబర్ 23:(మనం న్యూస్) : ప్లాస్టిక్ కాలుష్యాన్ని అరికట్టేందుకు హుస్నాబాద్ నియోజకవర్గంలో మంత్రి పొన్నం ప్రభాకర్ అమలు చేస్తున్న వినూత్న 'స్టీల్ బ్యాంక్' పథకానికి జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. ఈ వినూత్న ఆలోచనను కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖ మంత్రి భూపేందర్ యాదవ్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ మేరకు కేంద్ర మంత్రి మంత్రి పొన్నం ప్రభాకర్ కు అభినందన లేఖ రాశారు. ఆ లేఖను మంత్రి పొన్నం శుక్రవారం తన ఎ ఖాతాలో పోస్ట్ చేశారు.

**లేఖలో ఏముంది?**

గత జూలై 14న మంత్రి పొన్నం ప్రభాకర్ కేంద్ర మంత్రికి స్టీల్ బ్యాంక్ గురించి వివరిస్తూ లేఖ రాశారు. దానికి బదులుగా అక్టోబర్ 14న కేంద్ర మంత్రి భూపేందర్ యాదవ్ సమాధానం ఇచ్చారు. హుస్నాబాద్ లో గ్రామీణ ప్రాంతాల్లో జరిగే శుభకార్యాలు, వివాహాలు, ఇతర సామూహిక కార్యక్రమాల్లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించేందుకు స్టెయిన్ లెస్ స్టీల్ పాత్రలను అందుబాటులోకి తేవడం అనేది అభినందనీయమని ఆయన లేఖలో పేర్కొన్నారు. గ్రామస్థాయి నుంచే ప్లాస్టిక్ వ్యర్థాలను తగ్గించేందుకు ఈ స్టీల్ బ్యాంక్ ఒక మంచి నమూనా అని కితాబునిచ్చారు.

**ప్లాస్టిక్ రహిత హుస్నాబాద్ లక్ష్యం:**

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా హుస్నాబాద్ నియోజకవర్గంలో 280 మహిళా స్వయం సహాయక సంఘాలకు దాదాపు 70 వేల స్టీల్ ప్లేట్లను పంపిణీ చేసిన విషయం తెలిసిందే. గ్రామాల్లో ఏదైనా ఫంక్షన్ ఉంటే ఈ పాత్రలను తీసుకెళ్లి వాడుకుని తిరిగి ఇచ్చే విధానం ద్వారా ప్లాస్టిక్ ప్లేట్ల వాడకానికి పూర్తిగా చెక్ పెట్టాలనేది దీని లక్ష్యం.

ఈ సందర్భంగా కేంద్ర మంత్రి, కేంద్ర ప్రభుత్వం ప్లాస్టిక్ నిషేధంపై తీసుకుంటున్న చర్యలను కూడా లేఖలో వివరించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం, ప్లాస్టిక్ ప్యాకేజింగ్ పై ఇపిఆర్ విధానం, పునర్వినియోగాన్ని ప్రోత్సహించడం వంటి చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

"హోల్ ఆఫ్ గవర్నమెంట్, హోల్ ఆఫ్ సొసైటీ విధానంతో కేంద్రం, రాష్ట్రాలు, స్థానిక సంస్థలు, ప్రజలు కలిసి పనిచేస్తేనే ప్లాస్టిక్ కాలుష్యాన్ని సమర్థవంతంగా ఎదుర్కోగలమని నేను గట్టిగా నమ్ముతున్నాను" అని కేంద్ర మంత్రి లేఖలో పేర్కొన్నారు. దీనిపై మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందిస్తూ, కేంద్ర మంత్రి అభినందన తమకు మరింత ఉత్సాహాన్నిచ్చిందని, ప్లాస్టిక్ రహిత హుస్నాబాద్ గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని తెలిపారు.

# ముదిరాజ్ సింహ గర్జన పోస్టర్ ఆవిష్కరణ



భీమారం అక్టోబర్ 23(మనం న్యూస్ )మండల కేంద్రంలో, శుక్రవారం ముదిరాజ్ కమిటీ హాల్ లో ఈ నెల 25 వ తేదీన మంచిర్యాల జిల్లా కేంద్రంలో, జరిగే ముదిరాజ్ సింహ గర్జన సభకు సంబంధించిన చలో మంచిర్యాల చలో ముదిరాజ్ పోస్టర్ ను ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా ముదిరాజ్ కులం సంఘం సభ్యులు మాట్లాడుతూ.ఈ యొక్క ముదిరాజ్ సింహ గర్జన సభకు ముదిరాజ్ కులస్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా కోరుతున్నామని, తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా అధ్యక్షులు గరిగంటి. కొమురయ్య,జిల్లా ప్రధాన కార్యదర్శి సాధనబోయిన. క్రిష్ణ , జిల్లా యూత్ అధ్యక్షులు గరిగంటి. సుమన్ ముదిరాజ్ కుల సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు

# తొలగిస్తున్న సర్‌ను రద్దు చేయాలి




పెద్దపల్లి అక్టోబర్ 23 మనం న్యూస్: రాష్ట్ర ప్రజాసంఘాల పిలుపు మేరకు పెద్దపల్లి లో CITU, KVPS, SFI ఆధ్వర్యంలో కేంద్ర ఎన్నికల కమిషన్ జ్ఞానాష్ కుమార్ తొలిగించాలి అని జ్ఞానష్ కుమార్ దిష్టిబొమ్మ దగ్ధం చేస్తుండగా పోలీసులొచ్చి అడ్డుకోవడం జరిగింది అనంతరం కల్లె పల్లి అశోక్ ఖవూరా జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ

దేశవ్యాప్తంగా అమలవుతున్న సర్ ప్రక్రియ దళితులు గిరిజనులు ఆదివాసీలు, మైనార్టీల ఓట్లను టార్గెట్ చేస్తూ తొలగిస్తుందని తమకు వ్యతిరేకంగా ఓటు వేసే వారి ఓట్ల ను తీసేసే కార్యక్రమం చేస్తుంది అన్నారు ప్రజా సామ్యబద్ధంగా ఉండాల్సిన చట్టాలను బిజెపి ఆర్ఎస్ఎస్ జేబు సంస్థలుగా మార్చుకొని దేశంలో ప్రజాస్వామ్యాన్ని కూని చేస్తున్న పరిస్థితి ఈ దేశంలో కొనసాగుతుంది సార్ ప్రక్రియ వాళ్ళ అనేకమంది యువజన ఓట్లు ఉద్దేశపూర్వకంగానే తీసేస్తుంది ఈ దేశంలో యువత మొత్తం రోడ్ల మీదకు వచ్చి సార్ కి వ్యతిరేకంగా పోరాడుతూ జాతీయ ఎన్నికల కమిషన్ జ్ఞానేశ్ కుమార్ ని తొలగించాలని ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నప్పటికీ కేంద్ర బిజెపి ప్రభుత్వం స్పందించకపోవడంనే చాలా దుర్మార్గమని అన్నారు

CITU జిల్లా నాయకురాలు జ్యోతి మాట్లాడుతూ

సర్ ప్రక్రియ అమలు కావడం ద్వారా దేశంలో సుమారు 14 కోట్ల మంది వయోజన ఓటు హక్కుదారులు తమ ఓటును కోల్పోతున్నారని ఎన్నికల కమిషన్ స్వతంత్ర సంస్థగా ఉండాల్సిందిపోయి బిజెపి జేబుసంస్థగా కొనసాగడం వల్ల బిజెపి గెలుపుకు దోహదం చేస్తుందన్నారు ప్రజాస్వామ్యబద్ధంగా ప్రజలు ఎన్నుకునే ప్రక్రియలో అడ్డదారి తొక్కడం వల్ల బిజెపికి అనుకూల ఫలితాలు వస్తున్నాయని చెప్పారు ఓటు హక్కును తొలగించడం అంటే మనిషిశరీరంలోని ఒక అవయవాన్ని తొలగించడమేనని చెప్పారు. దేశంలో ప్రతిపక్షాలు విద్యార్థి యువతరం భారీ ఎత్తున జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని తీవ్ర ఒత్తిడి తీసుకొస్తుంటే జ్ఞానేష్ కుమార్ కు అండగా ఆర్ఎస్ఎస్ బిజెపి నిలుస్తుందన్నారు ఎన్నికల్లో బీజేపీ కి అండగా జ్ఞానేశ్ కుమార్ అండగా నిలుస్తున్నాడని ఆయన చెప్పారు. సర్ ప్రక్రియను తక్షణమే రద్దు చేయడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని రక్షించాలని ఆయన కోరారు

SFI జిల్లా కార్యదర్శి జిల్లాల ప్రశాంత్ మాట్లాడుతూ దేశంలో ఎస్ఐఆర్ కి వ్యతిరేకంగా యువత ఉద్యమాలు చేస్తున్నారు కేంద్ర బీజేపీ ప్రభుత్వం దేశ యువత, విద్యార్థుల పైన అక్రమంగా కేసు లు పెట్టి శాంతియుతంగా నిరసన చేస్తున్న వారిని ఇబ్బందులు పెట్టి హింసాత్మక గా మార్చే కుట్ర చేస్తున్న బీజేపీ సర్కార్ చేస్తూ నిరంకుశ పాలన ఈ దేశ ప్రజలు గమనిస్తున్నారు అన్నారు ఎస్ఐఆర్ పక్రియ ద్వారా తొలిగించిన ఓట్లను తిరిగి చేర్చాలని డిమాండ్ చేశారు

ఈ కార్యక్రమంలో CITU, KVPS SFI, సిపెల్లి రవీందర్, మోదెంపల్లి శ్రావణ్, కొమురయ్య, రాకేష్, ఆది కృష్ణ, శ్రీనివాస్ రెడ్డి, శ్రీశైలం,గౌతమ్ సాహు, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు

# అంగన్‌వాడీ టీచర్ పోస్టులకు అర్హుల జాబితా విడుదల



రాయికల్, అక్టోబర్ 23 (మనం న్యూస్) : రాయికల్ మండలంలో ఖాళీగా ఉన్న 10 అంగన్‌వాడీ టీచర్ పోస్టుల భర్తీకి సంబంధించి అర్హులు, అనర్హుల జాబితాను సీడీపీఓ జయప్రద శుక్రవారం విడుదల చేశారు. రాయికల్ మున్సిపాలిటీ పరిధిలో మూడు, గ్రామీణ ప్రాంతాల్లో ఏడు పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. రామారావుపల్లి, వస్తాపూర్, వీరాపూర్, శ్రీరాంనగర్, భూపతిపూర్, రామాజీపేట, లోక్యానాయక్ తండాతో పాటు రాయికల్ మున్సిపాలిటీ పరిధిలోని ఖాళీలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల జాబితాలను సంబంధిత మున్సిపల్ కార్యాలయం, గ్రామ పంచాయతీల్లో ప్రదర్శించినట్లు పేర్కొన్నారు. అనర్హుల జాబితాలో పేర్లు ఉన్న అభ్యర్థులకు ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 30వ తేదీలోగా జగిత్యాలలోని ఐసీడీఎస్ కార్యాలయంలో సంబంధిత అధికారులను సంప్రదించాలని సూచించారు. అర్హులైన అభ్యర్థులకు తదుపరి ఎంపిక ప్రక్రియ వివరాలను తెలియజేయనున్నట్లు సూపర్ వైజర్లు అనూహ్య, రాధ, పద్మావతి తెలిపారు.

# పెద్దపల్లి జిల్లా కలెక్టర్‌ను కలిసిన ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నూతన కార్యవర్గం

పెద్దపల్లి అక్టోబర్ 23 మనం న్యూస్ : పెద్దపల్లి జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నూతన కార్యవర్గ సభ్యులు శుక్రవారం జిల్లా కలెక్టర్ శ్రీ కోయ శ్రీహర్ష ను మర్యాదపూర్వకంగా కలిసి పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు కలెక్టర్ ని పరిచయం చేసుకున్నారు. జిల్లాలో రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో చేపట్టాల్సిన సేవా కార్యక్రమాల గురించి చర్చించారు. రక్తదాన శిబిరాలు, అత్యవసర సమయాల్లో రక్తం అందించడం, ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన కల్పించడం వంటి సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించేందుకు కార్యవర్గం కృషి చేయాలనీ కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ పెద్దపల్లి జిల్లా నూతన చైర్మన్ ఎరబాటి వెంకటేశ్వర్ రావు, వైస్ చైర్మన్ సాదుల వెంకటేశ్వర్లు, కోశాధికారి పాంపాటి శ్రీకాంత్, స్టేట్ మేనేజింగ్ కమిటీ సభ్యుడు కావేటి రాజగోపాల్, డిస్ట్రిక్ట్ కమిటీ సభ్యులు డీవీఎస్ మూర్తి, గూళ్ళ అంజన్ కుమార్, వేల్పుల రమేష్, వేల్పూరి సంపత్ రావు తదితరులు పాల్గొన్నారు. మానవ సేవే లక్ష్యంగా, ప్రజలకు అవసరమైన సమయంలో అండగా నిలుస్తూ, రెడ్ క్రాస్ సేవలను జిల్లావ్యాప్తంగా విస్తరించేందుకు నూతన కార్యవర్గం కృషి చేయాలని కలెక్టర్ సూచించారు.

# 45 రోజుల్లో రైస్ మిల్లర్లు పెండింగ్ బకాయిలు చెల్లించాలి



పెద్దపల్లిఅక్టోబర్ 23: మనం న్యూస్: డిఫాల్ట్ రైస్ మిల్లర్లు తమ పెండింగ్ బకాయిలను చెల్లించేందుకు ప్రభుత్వం 45 రోజుల గడువు కల్పించిందని అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు తెలిపారు. శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో సంబంధిత అధికారులు, డిఫాల్ట్ రైస్ మిల్లర్లతో బకాయిల వసూళ్లపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ బి శ్రీరాములు మాట్లాడుతూ, ప్రభుత్వం కల్పించిన 45 రోజుల గడువును డిఫాల్ట్ రైస్ మిల్లర్లు సద్వినియోగం చేసుకొని, తమకు సంబంధించిన పెండింగ్ బకాయిలన్నింటినీ నిర్ణీత గడువులోగా చెల్లించాలని సూచించారు. డిఫాల్ట్ రైస్ మిల్లర్లకు సంబంధించిన స్థిర, చర ఆస్తుల వివరాలను సబ్ రిజిస్ట్రార్ అధికారులు గుర్తించి, పూర్తి వివరాలను సేకరించాలని ఆదేశించారు. ప్రభుత్వం కల్పించిన 45 రోజుల గడువులోగా బకాయిలు చెల్లించని పక్షంలో సంబంధిత రైస్ మిల్లర్ల ఆస్తులను జప్తు చేసేందుకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఆర్డీఓ గంగయ్య, జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనాథ్, పౌరసరఫరాల మేనేజర్ శ్రీకాంత్, సబ్ రిజిస్ట్రార్ అధికారులు, సంబంధిత అధికారులు, డిఫాల్ట్ రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

# బయో పెస్టిసైడ్స్ పిచికారీతో పత్తి పంటకు నష్టం

**-క్షేత్రస్థాయి విచారణ జరిపి నష్టపరిహారం అందించాలని రైతు విజ్ఞప్తి**



పెద్దపల్లి అక్టోబర్ 23: మనం న్యూస్ : బయో పెస్టిసైడ్స్ పిచికారీ చేసిన అనంతరం తన పత్తి పంట తీవ్రంగా దెబ్బతిందని, ఈ ఘటనపై క్షేత్రస్థాయి విచారణ జరిపించి నష్టపరిహారం అందించాలని బాలరాజుపల్లె గ్రామానికి చెందిన రైతు కుంటూరి రాజయ్య జిల్లా వ్యవసాయ అధికారిని కోరారు. రైతు తెలిపిన వివరాల ప్రకారం.. జూలపల్లి మండలం బాలరాజుపల్లె గ్రామానికి చెందిన కుంటూరి రాజయ్య తనకున్న 2 ఎకరాల 20 గుంటల పత్తి పంటలో దోమ ఉధృతి అధికం కావడంతో, ఈ నెల 4న జూలపల్లి మండల కేంద్రంలోని ఓ ఫర్టిలైజర్ దుకాణంలో బయో పెస్టిసైడ్స్‌ను కొనుగోలు చేసినట్లు తెలిపారు. దుకాణ యజమాని సూచన మేరకు మందులను పిచికారీ చేసిన అనంతరం పత్తి మొక్కలు ఎర్రబారి పంట తీవ్రంగా దెబ్బతిన్నట్లు పేర్కొన్నారు. ఈ విషయాన్ని దుకాణ యజమాని దృష్టికి తీసుకెళ్లగా, కంపెనీ ప్రతినిధి పంటను పరిశీలించారని తెలిపారు. తదుపరి పరిశీలనకు వస్తామని చెప్పిన కంపెనీ అధికారులు ఇప్పటివరకు రాకపోవడంతో పాటు, పంట నష్టంపై ఎలాంటి పరిష్కారం లభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పంటను పరిశీలించి నష్టం వివరాలను నమోదు చేయాలని, వినియోగించిన బయో పెస్టిసైడ్స్ నాణ్యత, బ్యాచ్ వివరాలు, లేబుల్‌పై ఉన్న వినియోగ సూచనలపై విచారణ జరిపించాలని కోరారు. పంట నష్టాన్ని అధికారికంగా అంచనా వేసి, విచారణలో నిర్ధారణ అయ్యే బాధ్యతల మేరకు నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. బాధ్యులుగా తేలిన వారిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని జిల్లా వ్యవసాయ అధికారికి సమర్పించిన వినతిపత్రంలో కోరారు.

# కాళేశ్వరాన్ని పునరుద్ధరించి రైతులను ఆదుకోవాలి

పెద్దపల్లి అక్టోబర్ 23: మనం న్యూస్. కాళేశ్వరం ప్రాజెక్టును పునరుద్ధరించి రైతులకు సాగునీరు అందించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లేందుకు ఈ నెల 28న మేడిగడ్డ నుంచి కొండపోచమ్మసాగర్ వరకు 400 కిలోమీటర్ల సైకిల్ యాత్ర చేపట్టనున్నట్లు గోదావరిఖని బీఆర్ఎస్ టౌన్ ప్రెసిడెంట్, మాజీ కార్పొరేటర్ బొడ్డు రవీందర్, పెద్దపల్లి బీఆర్ఎస్ టౌన్ ప్రెసిడెంట్, మాజీ కౌన్సిలర్ ఉప్పు రాజ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా బొడ్డు రవీందర్ మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణలో సాగునీటి అవసరాలను తీర్చడంలో కీలకమైనదని పేర్కొన్నారు. మేడిగడ్డ బ్యారేజీ వద్ద తలెత్తిన సమస్యలను పరిష్కరించి, ప్రాజెక్టులోని ఇతర నిర్మాణాలను సైతం వినియోగంలోకి తీసుకురావాలని ప్రభుత్వాన్ని కోరారు. గోదావరి జలాలను సమర్థంగా వినియోగించుకునే అవకాశాలను పరిశీలించి, రైతులకు సాగునీరు అందించేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో రాజకీయాలకు అతీతంగా రైతుల ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. బ్యారేజీలు, రిజర్వాయర్లు, పంప్‌హౌస్‌లు, కాల్వల వ్యవస్థను సమగ్రంగా పరిశీలించి, సాంకేతికంగా సాధ్యమైన మేరకు నీటిని ఎత్తిపోసేందుకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సాగునీటి లభ్యత పెరిగితే వ్యవసాయ రంగానికి మేలు జరగడంతో పాటు రైతులకు భరోసా కలుగుతుందని పేర్కొన్నారు. గతంలో కాళేశ్వరం ప్రాజెక్టు ప్రాధాన్యతను ప్రజలకు వివరించేందుకు పాదయాత్ర నిర్వహించామని రవీందర్ తెలిపారు. ప్రస్తుతం రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు మరోసారి సైకిల్ యాత్రకు సిద్ధమయ్యామని చెప్పారు. ఈ నెల 28న మేడిగడ్డ నుంచి ప్రారంభమయ్యే యాత్ర కొండపోచమ్మసాగర్ వరకు కొనసాగుతుందని వెల్లడించారు. రైతులు, ప్రజలు యాత్రకు మద్దతు తెలిపి విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.




**కాళేశ్వరం కేవలం మేడిగడ్డకే పరిమితం కాదు**

పెద్దపల్లి బీఆర్ఎస్ టౌన్ ప్రెసిడెంట్ ఉప్పు రాజ్‌కుమార్ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కాళేశ్వరం ప్రాజెక్టులో లక్ష కోట్ల రూపాయల అవినీతి జరిగిందంటూ కాంగ్రెస్ పార్టీ చేసిన ఆరోపణలు ప్రజల్లో అపోహలకు దారితీశాయని విమర్శించారు. మేడిగడ్డ బ్యారేజీలో రెండు పిల్లర్లకు సంబంధించిన సమస్యను ప్రస్తావిస్తూ, మొత్తం ప్రాజెక్టుపై ప్రతికూల ప్రచారం చేశారని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టు కేవలం మేడిగడ్డ బ్యారేజీ మాత్రమే కాదని, మూడు బ్యారేజీలు, 14 రిజర్వాయర్లు, 31 లిఫ్ట్ వ్యవస్థలు, సుమారు 1,832 కిలోమీటర్ల కాల్వలు, సొరంగాలతో కూడిన విస్తృత నీటిపారుదల వ్యవస్థ అని వివరించారు. లక్ష్మీ, సరస్వతి, పార్వతి పంప్‌హౌస్‌లతో పాటు శ్రీపాద ఎల్లంపల్లి, మిడ్ మానేరు, మల్లన్నసాగర్, రంగనాయకసాగర్, అనంతగిరి, అన్నపూర్ణ, మల్కంపేట రిజర్వాయర్లు ఈ వ్యవస్థలో భాగంగా ఉన్నాయని తెలిపారు. భూగర్భ సొరంగాలు, సర్జ్ పూల్స్, ప్రెషర్ మెయిన్స్, విద్యుత్ సబ్‌స్టేషన్లు, నీటి పంపిణీ కాల్వలతో కూడిన ఈ ప్రాజెక్టును సమగ్రంగా పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. మేడిగడ్డ వద్ద తలెత్తిన సమస్యలను పరిష్కరించడంతో పాటు, సాంకేతికంగా వినియోగించుకునే అవకాశం ఉన్న ఇతర నిర్మాణాల ద్వారా సాగునీరు అందించే చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాసిపేట వాసు, పల్లె మధు, ముత్యం లక్ష్మీగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఇండోనేషియా అంతర్జాతీయ త్రీడీ ఆర్ట్ ప్రదర్శనకు క్యూరేటర్‌గా ఎస్ఎస్ఆర్ కృష్ణ



రామగిరి, అక్టోబర్ 23 (మనం న్యూస్): ప్రముఖ అంతర్జాతీయ త్రీడీ ఆర్టిస్ట్, జేఎన్‌టీయూ కాంట్రాక్ట్ అధ్యాపకుడు సింగారపు శివరామకృష్ణ (ఎస్ఎస్ఆర్ కృష్ణ) ఇండోనేషియాలో జరగనున్న ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ కళా ప్రదర్శనకు ముఖ్య అతిథిగా, క్యూరేటర్‌గా వ్యవహరించనున్నారు. ఇండోనేషియా ప్రభుత్వ మంత్రిత్వ శాఖ సహకారంతో సెకోలాహ్ టింగి మల్టీమీడియా, మల్టీమీడియా కాలేజ్ సంయుక్తంగా నిర్వహిస్తున్న AKSARA -- NUSANTARA & DUNIA అంతర్జాతీయ ప్రదర్శన అక్టోబర్ 28 నుంచి నవంబర్ 10, 2026 వరకు ఇండోనేషియాలోని యోగ్యకర్త నగరంలో జరగనుంది. ప్రపంచ లిపుల చారిత్రక వారసత్వం అనే ఇతివృత్తంతో నిర్వహిస్తున్న ఈ ప్రదర్శనలో 20 దేశాలకు చెందిన 175 మంది కళాకారులు రూపొందించిన 272 చిత్రాలను ప్రదర్శించనున్నారు. వివిధ దేశాల లిపుల చరిత్ర, సాంస్కృతిక విశిష్టతలను కళారూపాల్లో ఆవిష్కరించడమే ఈ ప్రదర్శన ముఖ్య ఉద్దేశం. ఈ ప్రదర్శనలో ఎస్ఎస్ఆర్ కె అకాడమీకి చెందిన కృష్ణ శిష్యులు 17 మంది రూపొందించిన చిత్రాలు కూడా ఎంపిక కావడం విశేషం. అంతేకాకుండా, కృష్ణ ప్రత్యేకంగా రూపొందించిన త్రీడీ ఆర్ట్‌ను రెండు వారాల పాటు ప్రదర్శించనున్నారు. ఇండోనేషియా, భారత్, ఇరాన్, చైనా, అర్జెంటీనా, కొలంబియా, ఫ్రాన్స్, జర్మనీ, కెన్యా, మొరాకో, మయన్మార్, పోలాండ్, రష్యా, సెర్బియా, సిరియా, టర్కీ, ఉక్రెయిన్, ఉరుగ్వే తదితర దేశాల కళాకారులు ఈ ప్రదర్శనలో భాగస్వాములు కానున్నారు. అక్టోబర్ 28న ఉదయం 9 గంటలకు ఇండోనేషియా డిప్యూటీ మంత్రి నేజర్ పత్రియ చేతుల మీదుగా ప్రదర్శన ప్రారంభోత్సవం జరగనుంది. తనకు ఈ అవకాశం కల్పించిన నిర్వాహకులకు, మిత్రుడు మియోన సెప్తకు ఎస్ఎస్ఆర్ కృష్ణ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. భారతదేశం తరఫున ప్రదర్శనకు ఎంపికైన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కూడా తమకు అవకాశం కల్పించిన కృష్ణకు కృతజ్ఞతలు తెలియజేశారు. అంతర్జాతీయ స్థాయిలో తమ చిత్రాలను ప్రదర్శించే అవకాశం లభించడం విద్యార్థుల కళా ప్రతిభకు గుర్తింపుగా నిలుస్తుందని నిర్వాహకులు పేర్కొన్నారు.

# హమాలీల హక్కుల కోసం కదం తొక్కండి

పెద్దపల్లి అక్టోబర్ 23: మనం న్యూస్ : హమాలీ కార్మికుల హక్కుల సాధన, ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు, ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలే లక్ష్యంగా తెలంగాణ హమాలీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సదస్సు నిర్వహించనుంది. యూనియన్ దశాబ్ది ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని అక్టోబర్ 25న ఆదివారం ఉదయం 10 గంటలకు పెద్దపల్లిలోని ఎం.బి. గార్డెన్స్‌లో సదస్సు నిర్వహించనున్నట్లు యూనియన్ నాయకులు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న హమాలీ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో యూనియన్ నాయకులు మాట్లాడుతూ.. 2016 అక్టోబర్ 25న జమ్మికుంట పట్టణంలో కొంతమంది హమాలీ కార్మికులతో ప్రారంభమైన తెలంగాణ హమాలీ వర్కర్స్ యూనియన్ నేడు రాష్ట్రంలోని 33 జిల్లాలకు విస్తరించి, వేలాది మంది సభ్యులతో బలమైన కార్మిక సంఘంగా ఎదిగిందని తెలిపారు. మండల, పట్టణ, జిల్లా స్థాయిల్లో కమిటీలను ఏర్పాటు చేసి కార్మికుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. కార్మికుల హక్కులు, వేతనాలు, పని పరిస్థితులు, సంక్షేమం వంటి అంశాలపై సభలు, సమావేశాలు, శిక్షణ తరగతులు నిర్వహిస్తూ ప్రభుత్వానికి పలుమార్లు వినతిపత్రాలు అందజేసినట్లు వివరించారు. రాష్ట్రంలో 10 లక్షల మందికి పైగా హమాలీ కార్మికులు వివిధ రంగాల్లో పనిచేస్తున్నారని నాయకులు తెలిపారు. మార్కెట్ యార్డులు, ఎఫ్‌సీఐ, సీడబ్ల్యూసీ, ఎస్‌డబ్ల్యూసీ గోదాములు, రైల్వే గూడ్స్ షెడ్లు, రైస్ మిల్లులు, వ్యవసాయ మార్కెట్లు, కూరగాయలు, పండ్ల మార్కెట్లు, రవాణా కేంద్రాలు, షాపింగ్ మాల్స్ తదితర ప్రాంతాల్లో లోడింగ్, అన్‌లోడింగ్ పనులు చేస్తూ సరుకుల రవాణాలో కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. ఇంతటి శారీరక శ్రమ చేస్తున్నప్పటికీ హమాలీ కార్మికుల జీవన పరిస్థితుల్లో ఆశించిన మార్పు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. శ్రమకు తగిన ఆదాయం లేకపోవడం, సమాన పనికి సమాన వేతనం అమలు కాకపోవడం, వలస కార్మికుల రాకతో పోటీ పెరగడం వంటి సమస్యలతో కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కఠినమైన పని పరిస్థితుల కారణంగా అనేకమంది కార్మికులు చిన్న వయస్సులోనే అనారోగ్య సమస్యలకు గురవుతున్నారని పేర్కొన్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ హమాలీ కార్మికుల కోసం ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయడంతో




పాటు మండల కేంద్రాల్లో హమాలీ కార్మికులకు కాలనీలు నిర్మించి ఇళ్లు కల్పిస్తామని హామీ ఇచ్చిందని నాయకులు గుర్తుచేశారు. ఈ హామీల అమలు కోసం కార్మికులు ఎదురుచూస్తున్నారని తెలిపారు. హామీల సాధనలో భాగంగా యూనియన్ నాయకులు జిల్లా కలెక్టర్లు, స్థానిక ఎమ్మెల్యేలు, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రిని కలిసి వినతిపత్రాలు అందజేశారని వివరించారు. రాష్ట్ర ప్రజావాణిలోనూ అధికారులను కలిసి సమస్యలను వివరించడంతో పాటు, వరంగల్‌లో వేలాది మందితో ర్యాలీ, సభ నిర్వహించామని, హైదరాబాద్‌లో రాష్ట్ర సదస్సు చేపట్టామని వెల్లడించారు. హమాలీ కార్మికులకు సామాజిక భద్రత కల్పించేందుకు ప్రత్యేక హమాలీ వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం, యూనియన్ నిర్మాణాన్ని మరింత బలోపేతం చేయడం, హక్కుల సాధన కోసం ఉద్యమాన్ని విస్తరించడం రాష్ట్ర సదస్సు ప్రధాన లక్ష్యాలని తెలిపారు. హమాలీ కార్మికుల హక్కుల సాధన కోసం ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని పేర్కొంటూ, అక్టోబర్ 25న పెద్దపల్లిలో నిర్వహించే దశాబ్ది ఆవిర్భావ సభకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి హమాలీ కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు, కార్మిక శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మీడియా సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నెడి వెంకటరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు జంగ సంపత్ యాదవ్... సహాయ కార్యదర్శి కామ భూమయ్య, నాయకులు పాలేటి వెంకటేష్, కాటం రాజు, జంగా రాజు తదితరులు పాల్గొన్నారు.

# పెద్దపల్లి సివిల్ హాస్పిటల్‌లో గర్భిణీకి రక్తదానం చేసిన ముగ్గురు రక్తదాతలు

పెద్దపెల్లి అక్టోబర్ 23 మనం న్యూస్. పెద్దపల్లి సివిల్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న ఓ గర్భిణీ మహిళకు అత్యవసరంగా రక్తం అవసరం కావడంతో, సమాచారం అందిన వెంటనే స్పందించిన ముగ్గురు రక్తదాతలు ముందుకు వచ్చి రక్తదానం చేశారు. మానవతా దృక్పథంతో స్పందించి, అత్యవసర సమయంలో రక్తదానం చేసేందుకు ముందుకు వచ్చిన ఉమేష్, శ్రీనివాస్, బండి నరేష్‌లను ఈ సందర్భంగా పలువురు అభినందించారు. వారి సేవ మరొకరి ప్రాణాలను కాపాడేందుకు ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ పెద్దపల్లి జిల్లా కోశాధికారి పాంపాటి శ్రీకాంత్, నిమ్మనపల్లి సర్పంచ్ వేల్పుల రమేష్, బి2 ఫౌండేషన్ చైర్మన్ బెజ్జంకి నరేష్ పాల్గొన్నారు. అలాగే యాక్టివ్ బ్లడ్ డోనర్స్ బండి శ్రీకాంత్, కేస శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాంపాటి శ్రీకాంత్ మాట్లాడుతూ, అత్యవసర సమయాల్లో రక్తం అందుబాటులో లేకపోవడం వల్ల రోగులు ఇబ్బందులు ఎదుర్కోకుండా ప్రతి ఒక్కరూ స్వచ్ఛంద రక్తదానానికి ముందుకు రావాలని



పిలుపునిచ్చారు. ముఖ్యంగా గర్భిణీ స్త్రీలు, ప్రమాద బాధితులు, ఇతర అత్యవసర చికిత్స పొందుతున్న వారికి రక్తం ఎంతో అవసరమని తెలిపారు. "రక్తదానం చేయండి -- ప్రాణాలను కాపాడండి. మీ ఒక్క యూనిట్ రక్తం మరొకరికి జీవితాన్ని అందించగలదు"లి అని ఆయన పేర్కొన్నారు.

# కరీంనగర్‌లో త్వరలో సినిమా తెరకెక్కిస్తా

-దర్శకుడు సంపత్ నంది



కరీంనగర్ అక్టోబర్ 23 మనం న్యూస్ : కరీంనగర్‌లో త్వరలో సినిమా తెరకెక్కించి, స్థానిక ప్రతిభావంతులైన యువతకు నటీనటులుగా అవకాశాలు కల్పిస్తానని ప్రముఖ సినీ దర్శకుడు సంపత్ నంది తెలిపారు. 'భోగి' సినిమా ప్రచారంలో భాగంగా శుక్రవారం కరీంనగర్‌లోని శుభమాంగల్య బ్యాంక్ హాల్లో పత్రికా సమావేశం చిట్ చాట్ నిర్వహించి ఆయన మాట్లాడారు...తెలంగాణ యాస, భాష, సంస్కృతిపై ఉన్న అభిమానంతో 1960 నాటి తెలంగాణ--మహారాష్ట్ర సరిహద్దు గ్రామీణ పరిస్థితుల నేపథ్యంలో 'భోగి' చిత్రాన్ని రూపొందించినట్లు తెలిపారు. భవిష్యత్తులో మెగాస్టార్ చిరంజీవితో సినిమా చేయాలనే కోరిక ఉందని, వీరనారి చాకలి ఐలమ్మ జీవిత చరిత్ర ఆధారంగా కూడా సినిమా తెరకెక్కించాలని భావిస్తున్నట్లు వెల్లడించారు. కరీంనగర్ ప్రాంతంతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్న సంపత్ నంది, స్థానిక యువతలోని ప్రతిభను ప్రోత్సహించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సినీ రంగానికి చెందిన పలువురు ప్రముఖులు, అభిమానులు పాల్గొన్నారు.

# క్రీడా పోటీలలో గెలుపోటములు సహజం




రాయికల్, అక్టోబర్ 23 (మనం న్యూస్) : రాయికల్ మండలం తాట్లవాయి గ్రామంలో నిర్వహించిన టీపీఎల్ సీజన్--3 పోటీల విజేతలకు మాజీ జడ్పీటీసీ జాదవ్ అశ్విని బహుమతులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటములు సహజమని, క్రీడలు యువతలో ఐక్యతా భావాన్ని పెంపొందించడంతో పాటు శారీరక దృఢత్వానికి దోహదపడతాయని అన్నారు. క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలని, గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలను ప్రోత్సహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు, క్రీడాకారులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# పునరావాస కాలనీల్లో గుడుంబా గుప్పు గుప్పు

- అరికట్టాల్సిన ఎక్సైజ్ శాఖ వసూళ్లకు లొంగిందని విమర్శలు

హాజీపూర్ అక్టోబర్ 23 మనం న్యూస్):ఎల్లంపల్లి పునరావాస కాలనీల్లో గుడుంబా గుప్పు గుప్పు మంటుంది. గత ప్రభుత్వ హయాంలో 99 శాతం గుడుంబా నిర్మూలన జరిగింది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో వచ్చినాక ఎక్సైజ్ శాఖ గుడుంబాను ప్రోత్సహిస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. ఎల్లంపల్లి పునరావాస కాలనీలు అయిన గుడిపేట్ ,నమ్నూర్ లో గుడుంబా విచ్చలవిడిగా దొరుకుతుంది. రోడ్డు నంబర్ 2 లో ఓ మహిళ రోజు లీటర్ల కొద్ది అమ్ముతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ప్రశ్నించిన స్థానికుల పై బూతు పురాణాలకు దిగుతున్నట్లు ,అవసరం అనుకుంటే నేర చరిత్ర ఉన్న తన రెగ్యులర్ కష్టమర్లతో దాడులు కూడా చేయిస్తామని బెదిరిస్తున్నట్లు చెబుతున్నారు. కాగా ఎక్సైజ్ శాఖకు చెందిన కొందరు కానిస్టేబుళ్లు నెల వారి వసూళ్లకు వస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. గుడుంబాకు బానిస అయిన 4 గురు వ్యక్తులు మృతిచెందడం కలకలం రేపుతుంది. స్థానిక పోలీస్ లు బైండోవర్ చేసిన గుడుంబా అమ్మే మహిళా జంకడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఎక్సైజ్ శాఖ తీవ్ర మైన చర్యలు తీసుకుంటేనే గుడుంబా అరికట్టవచ్చని కాలనీవాసులు గోడు వెళ్లబోసుకున్నారు.

## కరీంనగర్లో అక్టోబర్ 23 నుండి 26 వరకు ఆర్టిస్ట్రీ బ్రాండెడ్ జూవెలరీ షో




కరీంనగర్ రూరల్ అక్టోబర్ 23(మనం న్యూస్)..కరీంనగర్ మలబార్ గోల్డ్ మరియు డైమండ్ షోరూం నందు ముఖ్య అతిథిగా హాజరైన నగర కార్పొరేటర్ చొప్పరి జయశ్రీ చేతుల మీదుగా ఆర్టిస్ట్రీ షో బ్రాండెడ్ జూవెలరీ విశిష్ట ఆభరణాల ప్రదర్శనను ప్రారంభించారు, తదనంతరం వారు మాట్లాడుతూ సామాన్య ప్రజలకు సైతం అందుబాటు ధరలలో ఉండే విధంగా పిల్లలకు పెదలకు చూడముచ్చటగా ఉండే బంగారం వజ్రా భారణాలు, మరియు జాతి రత్నాలను అక్టోబర్ 23 నుండి 26 వరకు ప్రదర్శింస్తుందని ఈ ఆభరణాలు అద్వితీయమైన కళా నైపుణ్యంతో అంతులేని హుందాతణంతో కూడినవని నగిషి చెక్కిన ప్రతి ఆభరణం తయారు చేసిన వారి అనుభవం ఇంకా కళాత్మకు నిదర్శనంగా నిలుస్తూ "ఆర్ట్ ఇన్ ఎవ్రి జూవెల్ "ని బలపరుస్తున్నాయన్నారు, ఈ అవకాశాన్ని నగర ప్రజలతో పాటు పరిసర గ్రామాల ప్రజలు ఉపయోగించుకోవాలని కోరారు.ఈయొక్క కార్యక్రమంలో మలబార్ స్టోర్ హెడ్ ఫావాజ్ కబీర్, వివేక్, మేనేజర్ సిద్ధాంత్, మార్కెటింగ్ ఇంచార్జ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

## పోతరాజు వెంకటమ్మ మృతికి జర్నలిస్టుల నివాళి



మంథని,అక్టోబర్23 (మనం న్యూస్) : ఇటీవల అనారోగ్య కారణాల వల్ల మృతి చెందిన ఆంధ్రజ్యోతి మంథని ఆర్సీ ఇంచార్జీ, టీయూడబ్ల్యూజే (ఐజేయూ) ఎథిక్స్ కమిటీ చైర్మన్ పోతరాజు సమ్మయ్య మాతృమూర్తి పోతరాజు వెంకటమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ శుక్రవారం టీయూడబ్ల్యూజే నాయకులు శ్రద్ధాంజలి ఘటించారు. వెంకటమ్మ ఆత్మ శాంతించాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నామని టీయూడబ్ల్యూజే (ఐజేయూ)రాష్ట్ర ఉపాధ్యక్షులు బుర్ర సంపత్ కుమార్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి నారాయణదాసు అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు.

## పోలీస్ అమరవీరుల త్యాగాలు స్ఫూర్తిదాయకం

సిరిసిల్ల అక్టోబర్ 23 (మనం ప్రతినిధి) : పోలీస్ అమరవీరుల త్యాగాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే అన్నారు. పోలీస్ అమ-రవీరుల సంస్మరణ దినోత్సవం (పోలీస్ ఫ్లాగ్ డే) సందర్భంగా సిరిసిల్ల పట్టణ పోలీస్ స్టేషన్‌లో విద్యార్థులకు ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పనితీరు, నేరాల దర్యాప్తు, సీసీ కెమెరాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, షీ టీమ్స్, భరోసా కేంద్రం, బాంబ్ స్క్వాడ్ సేవలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు నాగేంద్రచారి, వెంకటేశ్వర్లు, సీఐ శ్రీనివాస్, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



## NHM ఉద్యోగుల నిరవధిక సమ్మెకు సంఘీభావం




పెద్దపల్లిఅక్టోబర్ 23 మనం న్యూస్వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న నేషనల్ హెల్త్ మిషన్ (NHM) ఉద్యోగులు తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం పెద్దపల్లి జిల్లా IDOC ప్రధాన గేటు వద్ద చేపట్టిన నిరవధిక సమ్మెకు TNGOs యూనియన్ పెద్దపల్లి జిల్లా పూర్తి సంఘీభావం ప్రకటించింది. ఈ సందర్భంగా శుక్రవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో TNGOs జిల్లా అధ్యక్షులు, ఉద్యోగుల జేఏసీ చైర్మన్ బొంకూరి శంకర్ ఆధ్వర్యంలో జిల్లా కార్యవర్గ సభ్యులు, యూనిట్ కార్యవర్గ సభ్యులు సమ్మె ప్రాంగణానికి చేరుకొని చీఎవీ ఉద్యోగులకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా బొంకూరి శంకర్ మాట్లాడుతూ, ప్రజలకు నిరంతరం వైద్య సేవలు అందించడంలో చీఎవీ ఉద్యోగుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు ప్రజారోగ్య పరిరక్షణలో వారు అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. అలాంటి ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం సానుకూల దృక్పథంతో పరిశీలించి, వారి న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరారు. చీఎవీ ఉద్యోగులను క్రమబద్ధీకరించి (=వస్త్రబశ్రీ్ఖతీ-అఫ్ఆశీఅ) వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని, మహిళా ఉద్యోగులకు 180 రోజుల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు మంజూరు చేయాలని, ఉద్యోగులందరికీ EHS (Employees Health Scheme) ఆరోగ్య పథకాన్ని వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. దీర్ఘకాలంగా సేవలందిస్తున్న ఉద్యోగులకు తగిన గుర్తింపు, న్యాయం కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. TNGOs యూనియన్ పెద్దపల్లి జిల్లా సెక్రటరీ అయిరెడ్డి సందీప్ రెడ్డి మాట్లాడుతూ, చీఎవీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు న్యాయమైనవని, వారి డిమాండ్ల సాధన కోసం ఉ ద్యోగ సంఘాలన్నీ ఐక్యంగా నిలవాల్సిన అవసరం ఉందని అన్నారు. ఉద్యోగుల కష్టాలను, వారి కుటుంబాల భద్రతను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం తక్షణమే స్పందించాలని కోరారు. ఉద్యోగుల హక్కుల పరిరక్షణలో ఎచీ+ూం యూనియన్ ఎల్లప్పుడూ ముందుంటుందని, చీఎవీ ఉద్యోగుల న్యాయమైన పోరాటానికి తమ సంఘం మద్దతు కొనసాగిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా చీఎవీ ఉ ద్యోగుల డిమాండ్లకు సంఘీభావం తెలియజేస్తూ, ప్రభుత్వం వెంటనే చర్చలు జరిపి సమస్యలకు పరిష్కారం చూపాలని నాయకులు కోరారు.

**ప్రధాన డిమాండ్లు:**

ఉద్యోగుల క్రమబద్ధీకరణ, ఉద్యోగ భద్రత కల్పన.

మహిళా ఉద్యోగులకు 180 రోజుల ప్రసూతి సెలవులు.

ఉద్యోగులందరికీ జుూూ ఆరోగ్య పథకం అమలు.

వేతనాలు, సేవా ప్రయోజనాలకు సంబంధించిన సమస్యల పరిష్కారం.

ఉద్యోగుల సంక్షేమానికి సంబంధించి ఇతర న్యాయమైన డిమాండ్ల అమలు.

ఈ కార్యక్రమంలో టీఎన్జీఓ జిల్లా కార్యదర్శి అయిరెడ్డి సందీప్ రెడ్డి, సంఘ భాద్యులు ఆడెపు శ్రీనివాస్, వీరగోని శ్రీనివాస్, మహేందర్ రెడ్డి, శ్రీధర్, ప్రవీణ్, ప్రేమ్ సాగర్, రవి, రాజేష్, లక్ష్మణ్, రమేష్, మధు, మహేందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్య గొంతుకను నొక్కుతున్న మోడీ ప్రభుత్వం




మంథని అక్టోబర్ 23 (మనం న్యూస్) : ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని ఖూనీ చేస్తూ 2023లో ఉన్న చట్టాన్ని రద్దు చేసి కొత్త చట్టాన్ని తీసుకొచ్చి చీఫ్ ఎలక్షన్ కమిషన్ నియామక ప్రక్రియను మార్చేసి అంతకు ముందు ఉన్న సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ స్థానంలో కేంద్ర కేబినెట్ మినిస్టర్ అమిత్ షాను కమిటీలో పెట్టుకొని మెజారిటీ పేరుతో తన అనుకూలమైన వ్యక్తి జ్ఞానేష్ కుమార్ ను నియమించి అతని చేత అనేక తప్పులు చేయించి దొంగ చాటుగా బిజెపి అనేక రాష్ట్ర ప్రభుత్వాలను కైవసం చేసుకుంటుందని అన్నారు.ప్రజాస్వామ్య బద్ధంగా నిరసన తెలిపే హక్కును కాలరాస్తూ ఢిల్లీలో శాంతియుతంగా ఆందోళన చేస్తున్న ఆందోళనలను అణచివేయడాన్ని పెద్దపల్లి జిల్లా మంథని మండల ప్రజాసంఘాలు తీవ్రంగా ఖండిస్తున్నాయని అన్నారు.ప్రజాసంఘాల పిలుపులో భాగంగా శుక్రవారం రోజున మండల కమిటీల ఆధ్వర్యంలో మంథని రోడ్ చౌరస్తాలో చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలనీ నినాదాలు చేశారు. ఈకార్యక్రమంలో వై. యాకయ్య మాట్లాడుతూ ఓట్ చోర్ కు పాల్పడుతున్న చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని,దేశంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించాలని అన్నారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం ఫాసిస్ట్ హిట్లర్ ను తలపించే విధంగా ఉద్యమాలను అణచివేసే ప్రయత్నం చేస్తుందని అన్నారు.సర్ లో జరుగుతున్న అవకతవకలను సమీక్షించి నిజమైన ఓటర్లను నమోదు చేసే బాధ్యత తీసుకోకుండా నిర్బంధాలతో ఉద్యమాన్ని అణిచివేయాలని చూస్తే హిట్లర్ కు పట్టిన గతే మోడీకి పడుతుందని అన్నారు.ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి ప్రాణాధారమని ప్రజలు తమ పాలకులను ఎన్నుకునే అత్యంత కీలకమైన రాజ్యాంగ హక్కు అని అన్నారు. ఓటర్ల జాబితాలో అక్రమాలు చోటు చేసుకోకుండా చూడాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉన్నదన్నారు. అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిపోకుండా అనర్హులకు అవకాశం కల్పించకుండా పారదర్శకంగా ఎన్నికల ప్రక్రియను నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు.ఎస్ఐ ఆర్ ప్రక్రియ ద్వారా పెద్ద సంఖ్యలో ఓటర్లు తమ ఓటు హక్కును కోల్పోతున్నారన్నారు. దేశంలో ఇప్పటికే 13 కోట్ల మందిని, రాష్ట్రంలో లక్షలాది మందిని ఓటర్ల జాబితా నుండి తీసివేశారన్నారు. ఓటర్ల జాబితా సవరణ పేరుతో ప్రజాస్వామ్య హక్కులకు విఘాతం కలిగించే చర్యలు చేపట్టడం సరైనది కాదని అన్నారు.కేంద్ర చీఫ్ ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని,ఎస్ఐఆర్ ప్రక్రియను నిలిపివేసి,ఓటర్ల జాబితా నుంచి తొలగించిన అర్హులైన ఓటర్ల పేర్లను తిరిగి చేర్చాలని,2023లో చేసిన ఎన్నికల కమిషన్ నియామక చట్టాన్ని రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆర్ల సందీప్,డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు గొర్రెంకల సురేష్,వ్య.కా.స నాయకులు వేల్పుల సురేష్,ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు బందెల రాజకుమార్ సిఐటియు భాగ్య,చుక్కమ్మ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అనుమతి లేకుండా ప్రైవేట్ క్లినిక్‌లు నడిపితే కఠిన చర్యలు

హుజురాబాద్, అక్టోబర్ 23 (మనం న్యూస్): హుజురాబాద్ డివిజన్ పరిధిలో అనుమతి లేకుండా ప్రైవేట్ క్లినిక్లు నడపరాదని, అనుమతి లేకుండా ప్రైవేట్ క్లినిక్లు నడిపే వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హుజురాబాద్ డిప్యూటీ డిఎంహెచ్ఐ డాక్టర్ ప్రభుదాస్ అన్నారు. హుజురాబాద్ పట్టణంలోని గాంధీనగర్ రోడ్డులో ఉన్న ప్రియాంక క్లినిక్ ను శుక్రవారం ఆయన ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రైవేట్ క్లినిక్ నిర్వహకుడు కుమార్ ను పలు ప్రశ్నలు అడిగారు. ఆయుర్వేద ఆస్పత్రి నడపాలంటే తప్పనిసరిగా సర్టిఫికెట్ ఉండాలని, తెలంగాణ మెడికల్ కౌన్సిల్ అనుమతి లేని సర్టిఫికెట్ తో ఇక్కడ వైద్యం చేయరాదనీ అన్నారు. అర్హత, అనుమతి లేకుండా ఆసుపత్రి నడపడం ప్రజల ప్రాణాలతో చెలగాటమాడటమేనని అన్నారు. ఆకర్షణీయమైన ఆసుపత్రి బోర్డులను తొలగించాలని ఆదేశించారు. ప్రతి ప్రవేట్ క్లినిక్ నిర్వాహకులు తప్పనిసరిగా డిఆర్ఎ చట్టప్రకారం రిజిస్ట్రేషన్ చేసుకోవాలని రిజిస్ట్రేషన్ కాలం పూర్తయిన వారు తిరిగి రెన్యువల్ చేయించుకోవాలని లేని పక్షంలో ఆసుపత్రులు జరిమానాతో పాటు సీజ్ చేయడం జరుగుతుందని అన్నారు. కొత్తగా ప్రవేట్ క్లినిక్లు నడిపేవారు తప్పనిసరిగా డాక్టర్ల అర్హత పత్రాలు తెలంగాణ మెడికల్ కౌన్సిల్ రిజిస్ట్రేషన్ పత్రాలు పారామెడికల్ స్టాఫ్ తెలంగాణ పారామెడికల్ బోర్డులో రిజిస్టర్ అయిన వారు మాత్రమే అర్హులని అన్నారు. ప్రతి ఒక్కరు తప్పనిసరిగా డిఆర్ఎ అనుమతి తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆదేశాలు పాటించాలని ఆయన తెలిపారు. తప్పనిసరిగా జిల్లా కలెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆదేశాల మేరకు బయో వేస్ట్ మేనేజ్మెంట్ డిస్టిక్ ఫైర్ ఆఫీసు నుండి నో ఆబ్జెక్షన్ సర్టిఫికెట్ సమర్పించాలని అన్నారు. ఆసుపత్రి మూసి వేయాలని తెరిచినట్లు మరో సారి ఫిర్యాదు వస్తే కేసు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు.

# మెట్‌పల్లి బస్టాండ్‌లో అదనపు ఫ్లాట్‌ఫాంల ఏర్పాటు కోసం

## రవాణా శాఖ మంత్రిని కలసి వినతిపత్రం అందిస్తా

**-ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజ య్**







మెట్ పల్లి అక్టోబర్ 23 ( మనం న్యూ స్ ) మెట్ పల్లి బస్టాండ్ లో అదనపు ఫ్లాట్ ఫాశీల ఏర్పాటు కోసం రవాణా శాఖ మంత్రిని కలసి వినతిపత్రం అంది స్తానని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుం ట్ల సంజయ్ అన్నారు. శుక్రవారం పట్ట ణంలోని బస్టాండ్ తో పాటు ప్రభుత్వ ఆసుపత్రిని ఆయన సందర్శించారు. మెట్ పల్లి బ స్టాండ్‌ను సందర్శించిన ఎమ్మెల్యే బస్టాండ్ పరిసరాలను పరి శీలించి, అక్కడి పారిశుద్ధ్య నిర్వహణ పై ఆర్టీసీ అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లా డుతూ మెట్ పల్లి బస్టాండ్ నుంచి ప్రతి రోజు సు మారు 20 వేల మంది ప్రయాణి కులు రాకపోకలు సాగిస్తున్నారని, ఇంత పెద్ద సంఖ్యలో ప్రయాణికులు వచ్చే బ స్టాండ్‌ను నిత్యం పరిశుభ్రంగా ఉంచాల్సి న బాధ్యత అధికారులపై ఉందని తెలి పారు.ఈ బస్టాండ్ ప్రస్తుతం పెరిగిన ప్ర యాణికుల రద్దీకి అనుగుణం గా లేదని, అదనపు బస్ ప్లాట్ ఫాంల ఏర్పాటు ఎం తో అవసరమని పేర్కొన్నారు. ఈ విష యమై రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొ న్నం ప్రభాకర్ ను స్వయంగా కలిసి అద నపు ప్లాట్‌ఫాంల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని వినతిపత్రం అంద జేస్తానని తెలిపారు.బస్టాండ్ లోని మరు గుదొడ్లను ఎప్పటిక ప్పుడు శుభ్రపరచాల ని, ప్రయాణికులకు నిరంతరం నీటి సర ఫరా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించా రు. తాగునీటి సౌకర్యం, ప్రయాణికులు కూర్చునేందుకు తగిన ఏర్పాట్లు, బస్టాం డ్ ఆవరణలో చెత్త పేరుకుపో కుండా నిత్యం పారిశుద్ధ్య పనులు చేపట్టాలని తెలిపారు.అనంతరం మెట్ పల్లి ప్రభు త్వ ఆసుపత్రిని సందర్శించిన ఎ మ్మెల్యే ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగు లను పరామర్శించి, వారి ఆరోగ్య పరి స్థి తులను, అందుతున్న వైద్య సేవలను అ డిగి తెలుసుకున్నారు.ఆసుపత్రిలో రోగు లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నాణ్యమైన వైద్య సేవలు అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఆసుప త్రిలో మందుల లభ్యత, పరిశుభ్రత, తా గునీటి సౌకర్యం తదితర అంశాలపై ప్ర త్యేక దృష్టి సారించాలని తెలిపారు.అ నంతరం ప్రభుత్వ ఆసుపత్రి నూతన భవనాన్ని సందర్శించి పరిశీలించారు.

# రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన యువకుడి నేత్రదానం



రామగిరి, అక్టోబర్ 23 (మనం న్యూస్): రామగిరి మండలం బేగంపేట గ్రామానికి చెందిన ముత్తె అరవింద్ కల్యాణ్ (32) హన్మకొండలో ఈ నెల 22న జరిగిన బైక్ ప్రమాదంలో మృతి చెందారు. తీవ్ర విషాదంలోనూ ఆయన కుటుంబ సభ్యులు తీసుకున్న ఉదార నిర్ణయం ఇద్దరు అంధులకు చూపును ప్రసాదించింది.హాఅరవింద్ కల్యాణ్ మృతి అనంతరం ఆయన సమీప బంధువు లగిశెట్టి రాజకిశోర్ కుటుంబ సభ్యులకు నేత్రదానంపై అవగాహన కల్పించారు. దీంతో కుటుంబ సభ్యులు నేత్రదానానికి అంగీకరించగా, ఎల్‌వీపీ టెక్నీషియన్ నరేందర్ సహకారంతో కార్నియాలను సేకరించి హైదరాబాద్ ఐ బ్యాంకుకు పంపించారు. ఈ నిర్ణయం ద్వారా ఇద్దరు అంధులకు చూపు కలిగే అవకాశం లభించింది.హానేత్రదాత అరవింద్ కల్యాణ్ తల్లిదండ్రులు ముత్తె కల్యాణి, చంద్రమౌళి, సోదరుడు ముత్తె సుమన్‌తో పాటు నేత్రదానంపై అవగాహన కల్పించిన లగిశెట్టి రాజకిశోర్‌ను బంధుమిత్రులు అభినందించారు. దివంగత అరవింద్ కల్యాణ్‌కు నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.హాఈ కార్యక్రమంలో సందేల కుమార్, కాట సది, శివ, బొడ్డు రవీందర్, దూండే రాజయ్య, కాసర్ల శ్రీను, రాజేశం, కరస్పాండెంట్ తిరుపతి రెడ్డి, బర్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.హాసదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షులు శ్రవణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, కార్యదర్శి డాక్టర్ భీష్మాచారి, ప్రచార కార్యదర్శి వాసు, గౌరవ అధ్యక్షులు రామకృష్ణారెడ్డి, ముఖ్య సలహాదారు రమేష్, జిల్లా గౌరవ అధ్యక్షులు లగిశెట్టి చంద్రమౌళి, జిల్లా అధ్యక్షులు ఆరేపల్లి రాజమౌళి, కె. సమ్మయ్య తదితరులు నేత్రదానం చేసిన కుటుంబ సభ్యులకు అభినందనలు, ధన్యవాదాలు తెలిపారు.హామరణానంతరం కూడా మరొకరి జీవితంలో వెలుగులు నింపవచ్చని అరవింద్ కల్యాణ్ నేత్రదానం చాటిచెప్పింది.

# జాతీయ స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైన వంశికకు కేటీఆర్ అభినందనలు



సిరిసిల్ల అక్టోబర్ 23 (మనం ప్రతినిధి) : రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం నామాపూర్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని గూడెపు వంశిక జాతీయ స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా హైదరాబాద్ లోని తెలంగాణ భవన్‌లో వంశికను కలిసిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అభినందించి, అన్ని విధాలా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.అక్టోబర్ 10 నుంచి 13 వరకు నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన వంశిక, ఉమ్మడి కరీంనగర్ జిల్లా జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించి జట్టును సెమీఫైనల్స్‌కు చేర్చడంలో కీలక పాత్ర పోషించింది. బౌలింగ్‌లోనూ ప్రతిభ చాటింది. వచ్చే నవంబర్ మొదటి వారంలో జమ్మూ కాశ్మీర్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో వంశిక తెలంగాణ తరఫున ప్రాతినిధ్యం వహించనుంది.వంశికకు శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు కుంట శ్రీనివాస్‌ను పలువురు అభినందించారు.

# గుర్తుతెలియని వాహనం ఢీకొని వృద్ధుడికి తీవ్ర గాయాలు

చిగురుమామిడి, అక్టోబర్ 23 (మనం న్యూస్) : చిగురుమామిడి మండలంలోని సుందరగిరి గ్రామంలో విషాద ఘటన చోటుచేసుకుంది. దేవాలయం ముందు పని ముగించుకుని మెడికల్ షాపులో మందులు తీసుకుని ఇంటికి వస్తుండగా గుర్తుతెలియని టూవీలర్ వాహనం ఢీకొని ఓ వృద్ధుడు తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడిని సుందరగిరి గ్రామానికి చెందిన ఎలగందుల ఎల్లయ్య (70) గా గుర్తించారు. ఎల్లయ్య ,దేవాలయం పని ముగించుకుని మందులు తీసుకుని నడుచుకుంటూ వస్తుండగా, ఎదురుగా వేగంగా వచ్చిన గుర్తుతెలియని వాహనం బలంగా ఢీకొట్టింది. దీంతో అతను అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. ఈ ప్రమాదంలో ఎల్లయ్య తలకు, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదం అనంతరం వాహనదారుడు అక్కడి నుండి పరారయ్యాడు. స్థానికులు వెంటనే స్పందించి గాయపడిన ఎల్లయ్యను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

# బూర్గంపహాడ్‌లో వృద్ధురాలు గుర్తింపు కోసం పోలీసుల విజ్ఞప్తి



రామగిరి, అక్టోబర్ 23 (మనం న్యూస్): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపహాడ్ మండలం మొరంపల్లి బంజర పరిసర ప్రాంతాల్లో సుమారు 70 ఏళ్ల వృద్ధురాలు కనిపించారు. ఆమె తన పేరు కమలమ్మ అని, తన ఊరు బెల్లంపల్లి, గోదావరిఖని, రాపల్లి ప్రాంతాలకు సంబంధించినదని చెబుతున్నప్పటికీ పూర్తి వివరాలు వెల్లడించలేకపోతున్నారు.హావృద్ధురాలిని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో బూర్గంపహాడ్ ఎస్ఐ మేడా ప్రసాద్ అక్కడికి చేరుకుని వృద్ధురాలిని పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారు.హావృద్ధురాలి కుటుంబ సభ్యులు, బంధువులు లేదా ఆమెకు సంబంధించిన వివరాలు తెలిసినవారు బూర్గంపహాడ్ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని ఎస్ఐ మేడా ప్రసాద్ కోరారు. సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: 8712682055- 8712682056 వృద్ధురాలి ఆచూకీ గుర్తించేందుకు ప్రజలు సహకరించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

# రైతుల కష్టాలు తీర్చేందుకు మార్కెట్ చైర్ పర్సన్ స్వప్న సదానందం చొరవ..!

**ఎండిపోతున్న పంటలకు సాగునీరు...**

**రైతుల విజ్ఞప్తితో చెరువు నీటి విడుదల...**



జమ్మికుంట, అక్టోబర్ 23 (మనం న్యూస్): సాగునీరు అందక పంట పొలాలు ఎండిపోతున్న తరుణంలో రైతుల విజ్ఞప్తికి జమ్మికుంట మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ పుల్లూరి స్వప్న సదానందం స్పందించారు. రైతుల సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, చెరువులో నిల్వ ఉన్న నీటిని తూము ద్వారా బయటకు విడుదల చేయించేలా చొరవ తీసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే... జమ్మికుంట మండలం వావిలాల గ్రామంలోని పెద్ద చెరువు కింద ఉన్న సుమారు 250 ఎకరాల వరి పొలాలకు సరైన సమయంలో సాగునీరు అందకపోవడంతో బాధిత రైతులు ఆందోళనకు గురయ్యారు. ఎంతో కష్టపడి సాగు చేసిన పంటలు నీరు లేక ఎండిపోతుండటంతో పెట్టిన పెట్టుబడులు వృథా అవుతాయనే ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితిని వివరిస్తూ రైతులు శుక్రవారం మార్కెట్ చైర్‌పర్సన్ పుల్లూరి స్వప్న సదానందం ను కలిసి సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రైతుల విజ్ఞప్తిపై స్పందించిన చైర్ పర్సన్ స్వప్న సదానందం వెంటనే నీటి పారుదల శాఖ అధికారులతో మాట్లాడి చెరువులోని నీటిని తూము ద్వారా బయటకు విడుదల చేయించారు. దీంతో పంట పొలాలకు సాగునీరు అందించేందుకు అవకాశం ఏర్పడింది. పంటలు ఎండిపోయి రైతులు నష్టపోకుండా సమయానికి స్పందించి నీటి విడుదలకు చొరవ చూపిన మార్కెట్ చైర్‌పర్సన్ స్వప్న సదానందం కు బాధిత రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

# సీఎంఆర్ఎఫ్‌తో ఆపదలో ఉన్న వారిని ఆదుకుంటున్నాం

హుజురాబాద్, అక్టోబర్ 23 (మనం న్యూస్): ఆపదలో ఉన్న వారిని అందుకుంటూ, ప్రతి గడపకు కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేస్తున్నామని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు. హుజురాబాద్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఇంచార్జ్ ప్రణవ్ పంపిణీ చేశారు. హుజరాబాద్ పట్టణ, మండల, కమలాపూర్, వీణవంక, ఇల్లందకుంట మండలాలకు చెందిన రూ.53లక్షల విలువచేసే 153 చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం ప్రణవ్ మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదలకు అండగా ఉంటుందని, వారి సంక్షేమానికి ఎప్పుడు ముందుంటామని తెలిపారు. ఉచిత బస్సు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, సన్నబియ్యం, రైతు భరోసా, రుణమాఫీ, సన్న వడ్లకు బోనస్ లాంటి అనేక అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రజలు చేరవేస్తున్నామని అన్నారు. సోషల్ మీడియాలో అబద్ధపు ప్రచారాలు తప్ప ఇక్కడ కౌశిక్ రెడ్డి చేసింది ఏం లేదని ఎద్దేవా చేశారు. ప్రభుత్వం ఇచ్చే చెక్కుల పంపిణీ లో ముఖ్యమంత్రి ఫోటో లేకుండా ఇవ్వడం కౌశిక్ రెడ్డి అవివేకతనానికి నిదర్శనం అని అన్నారు. ఈ కార్యక్రమంలో హుజరాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ సుహాసిని, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, పట్టణ, మండలాల అధ్యక్షులు, మహిళా అధ్యక్షురాల్లు, అన్ని గ్రామాల సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, సీనియర్ కాంగ్రెస్, బ్లాక్ కాంగ్రెస్, సేవాదళ్, యువజన, యూత్, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సెల్, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



# మాట ఇచ్చారు.. నిలబెట్టుకున్నారు...



జమ్మికుంట, అక్టోబర్ 23 (మనం న్యూస్): కొంత మంది నేతల హామీలు నీటి మూటలుగా మారుతున్న ప్రస్తుత తరుణంలో.. అందుకు భిన్నంగా ఇచ్చిన హామీలను ఆచరణలో నిలబెట్టుకునే నాయకులు అరుదు అని చెప్పొచ్చు. ఆ కోవకు చెందిన వారే జమ్మికుంట మండలం తనుగుల గ్రామ ఉప సర్పంచ్ అంబాల స్వప్న రజనీకాంత్. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వారు "స్వేచ్ఛ ఆడబిడ్డ" పేరిట తమ గ్రామంలో ఆడబిడ్డ పుట్టిన కుటుంబానికి రూ.2,016 ఇవ్వనున్నట్టు ప్రకటించారు. నాటి మాటను నేడు (శుక్రవారం) నిలబెట్టుకున్నారు. గ్రామానికి చెందిన ఇద్దరు ఆడ బిడ్డలకు రూ.2,016 చొప్పున అంబాల రజనీకాంత్ జన్మదినం సందర్భంగా అందజేశారు. ఆడపిల్ల జన్మను గౌరవిస్తూ, ఆడబిడ్డల పట్ల సమాజంలో గౌరవాన్ని పెంపొందిస్తూ, వారి భవిష్యత్తుకు భరోసా కల్పించే గొప్ప ఆశయంతో "స్వేచ్ఛ ఆడబిడ్డ పథకాన్ని" ఉపసర్పంచ్ అంబాల స్వప్న రజనీకాంత్

ప్రారంభించడం పట్ల సర్పంచ్ జక్కె కిరణ్, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. "స్వేచ్ఛ ఆడబిడ్డ" వాల్ పోస్టర్ ను అందరూ కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ అంబాల రజనీకాంత్ మాట్లాడుతూ... ఆడపిల్ల అంటే భారం కాదు... ఒక కుటుంబానికి వరం, సమాజానికి గర్వకారణం అని, ప్రతి ఆడబిడ్డకు గౌరవం, ప్రేమ, సమాన అవకాశాలు అందాలనే ఆలోచనతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్టు వెల్లడించారు. ఆడపిల్ల పుట్టుకను గౌరవించే ఆలోచన మరెందరికో స్ఫూర్తిగా నిలవాలని, ఈ పథకం ఆడబిడ్డల జీవితాల్లో ఆనందాన్ని నింపాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామనీ పేర్కొన్నారు. ఆడబిడ్డను గౌరవిద్దాం... ఆడబిడ్డను ఆదరిద్దాం... ఆడపిల్లల భవిష్యత్తుకు బంగారు బాటలు వేద్దాం అని పిలుపునిచ్చారు. గ్రామ పంచాయతీ ఆఫీసుకు " గ్రామ పంచాయతీ కార్యాలయం" పేరిట బోర్డు ను సైతం ఉప సర్పంచ్ దంపతులు బహూకరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కిరణ్ జక్కే, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు



కరీంనగర్ అక్టోబర్ 23(మనం బ్యూరో )...కరీంనగర్ పోలీస్ కమీషనరేట్: పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకొని ఈ నెల అక్టోబర్ 25వ తేదీ ఆదివారం రోజున నిర్వహించబోయే సైకిల్ ర్యాలీకి సంబంధించిన పోస్టర్ మరియు రూట్ మ్యాప్‌లను కరీంనగర్ పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఆదివారం ఉదయం ఈ సైకిల్ ర్యాలీ పోలీస్ పరేడ్ గ్రౌండ్ నుండి ప్రారంభమవుతుందని సీపీ తెలిపారు. పరేడ్ గ్రౌండ్ నుండి మొదలై బస్ స్టేషన్, ప్రతిమ మల్టీప్లెక్స్, గీతాభవన్ చౌరస్తా, మంకమ్మతోటలోని పొన్నం కాంప్లెక్స్, కెమిస్ట్ భవన్ మీదుగా సాగి, ఎలక్ట్రిసిటీ కార్యాలయం వద్ద యూ టర్న్ తీసుకుంటుంది. అనంతరం కోర్ట్ చౌరస్తా, మంచిర్యాల చౌరస్తా, గాంధీ చౌరస్తా, నాఖా చౌరస్తా, బోట్ చౌరస్తా, కమాన్ చౌరస్తా, తిరిగి బస్టాండ్ సర్కిల్, ప్రతిమ మల్టీప్లెక్స్ మీదుగా ప్రయాణించి పోలీస్ పరేడ్ గ్రౌండ్ వద్ద ముగుస్తుందని ఆయన వివరించారు. ఈ సైక్లింగ్ ర్యాలీ నగరంలో దాదాపు 20 కిలోమీటర్ల మేర జరగనుందని సీపీ పేర్కొన్నారు. పోలీస్ అమరవీరుల వారోత్సవాలలో ప్రజలను భాగస్వామ్యం చేసే ఉద్దేశ్యంతో అక్టోబర్ 31వ తేదీ వరకు పలు కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు పోలీస్ కమీషనర్ తెలిపారు. ఈ పోలీస్ అమరవీరుల వారోత్సవాలను విజయవంతం చేయడానికి ప్రజలు, ముఖ్యంగా విద్యార్థులు ఈ పోటీలలో మరియు కార్యక్రమాలలో ఉత్సాహంగా పాల్గొనాలని పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం కోరారు.

# కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై సిఐటియు ధ్వజం

- 25న ఇందిరా పార్కు వద్ద ధర్నా
- 12వ వేతన కమిటీ వెంటనే ఏర్పాటు చేయాలి
- సొంతింటి కల అమలయ్యేంతవరకు పోరాటం చేస్తాం
- కేంద్ర బొగ్గు మంత్రి కిషన్ రెడ్డి మౌనం విడాలి - సిఐటియు డిమాండ్




మందమర్రి, అక్టోబర్ 23:(మనం న్యూస్) కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 25న (ధర్నా చౌక్) ఇంద్ర పార్క్ వద్ద సి ఐ టి యు ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహిస్తుందని సిఐటియు మందమర్రి బ్రాంచ్ అధ్యక్షులు వెంకటస్వామి యూనియన్ కార్యదర్శి రాజిరెడ్డిలు అన్నారు. శుక్రవారం కే కే 5 గని పై సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు మందమర్రి బ్రాంచ్ అధ్యక్షులు ఎస్. వెంకట్ స్వామి ఆధ్వర్యంలో యూనియన్ సెక్రటరీ కామ్రేడ్ తుమ్మల రాజారెడ్డి కార్మికులతో మాట్లాడుతూ గతంలో సంస్థ బకాయిల కోసం విద్యుత్ సౌదా దగ్గర ఏప్రిల్ లో ధర్నా చేసి విద్యుత్ సంస్థలపై ఒత్తిడి తేవడం జరిగిందని తెలిపారు. అక్టోబర్ 25 ఆదివారం రోజున సి ఐ టీ యు ఆధ్వర్యంలో ప్రభుత్వ రంగ పరిశ్రమలను కాపాడాలని నరేంద్ర మోడీ బిజెపి ప్రభుత్వం పాటిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను రాష్ట్రంలో, ప్రభుత్వ రంగ సంస్థలలో అమలు చేయవద్దని డిమాండ్ చేస్తూ పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. ఈ ధర్నాను కార్మికులందరూ పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సింగరేణి కి రావాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలని, దసరా సందర్భంగా కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సింగరేణిలో లేబర్ కోడ్ లను అమలు చేయవద్దని పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. సిఐటియు గా గత కొన్ని సంవత్సరాలు గా కార్మికులను చైతన్యవంతం చేస్తూ అధికారుల, ప్రభుత్వ దృష్టికి కార్మికుల సమస్యలను పదేపదే తీసుకు వెళ్లడం లో సిఐటియు ముందు వరుసలో ఉందని వారు పేర్కొన్నారు. నేడు సొంతింటి కలపై ప్రభుత్వం తరఫున ప్రకటన వచ్చిందని ప్రకటనతోనే ఆగకుండా, అమలు అయ్యేంతవరకు పోరాడుతామన్నారు. ఎవరు ఎన్ని విమర్శలు చేసిన కార్మికుల శ్రేయస్సే లక్ష్యంగా సిఐటియు యూనియన్ ముందుకు సాగుతుందని హామీ ఇచ్చారు. కార్మికులకు రావాల్సిన ప్రతి పైసా పై అనునిత్యం పోరాటం చూస్తున్నామని, అందులో భాగంగానే సీఎంపిఎఫ్ కు గతంలో తక్కువ కట్టించిన వడ్డీ రేటును తిరిగి కట్టించేలా సిఐటియు చేసిందని వారు గుర్తు చేశారు. గత ఆరు నెలలుగా సీఎంపిఎఫ్ బ్యాలెన్స్ పై కార్మికులు అయోమయానికి గురవుతున్నారని, దాని పరిష్కారానికి గోదావరిఖని లోని కమిషనర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపి సిఐటియు ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశామని గుర్తు చేశారు. 12వ వేతన ఒప్పందం ఏర్పాటు గురించి లేబర్ కోడ్ లను సవరించాలని, కోలిండియా యాజమాన్యానికి లేఖ రాసిన కూడా స్పందించలేదని వారు విమర్శించారు. కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి తెలంగాణ వారైనా ఇప్పటివరకు దానిపై స్పందించక పోవడం విచారించదగ్గ విషయం అన్నారు. పాత వాటికి అనుమతులు వచ్చినప్పుడు గొప్పలు చెప్పుకున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, కార్మిక సంఘా నాయకులు, కోల్ బెల్ట్ ప్రాంతాల్లో తిరిగే ఇతర రాజకీయ పార్టీల నాయకులు ఎందుకు 12వ వేతన కమిటీపై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. రాజకీయ పార్టీలు గానీ నాయకులు గానీ కార్మికులతో రాజకీయాలు చేయవద్దని అవసరమైతే బొగ్గు పరిశ్రమను కాపాడాలి కానీ పరిశ్రమకు నష్టం చేకూర్చే పనులు చేయకూడదని హితవు పలికారు. ఏదేమైనా భవిష్యత్తులో సింగరేణిలో జరిగే ఎన్నికలలో ఎక్కువ కార్మిక సంఘాలకు మెజార్టీ వచ్చేలా కార్మికులు ఓట్లు వేయాలని, నూతన లేబర్ కోడ్ల వలన ఏ ఒక్క యూనియన్ గెలిచే పరిస్థితి లేనందున కార్మికులు ఎలాంటి ప్రలోభాలకు గురి కావద్దని కోరారు.

**గోడ పత్రికల విష్కరణ**

25న చలో హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద ధర్నా వాల్ పోస్టర్ ను కార్మికుల సమక్షంలో ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిఐటియు మందమర్రి బ్రాంచ్ అధ్యక్షులు ఎస్. వెంకట స్వామి, యూనియన్ కార్యదర్శి తుమ్మల రాజిరెడ్డి, డిప్యూటీ జనరల్ సెక్రటరీ అల్లి.రాజేందర్, పిట్ సెక్రటరీ బద్రి.ఆదర్శ్, బ్రాంచ్ ఉపాధ్యక్షులు లింగాల సత్యనారాయణ, పిట్ ఇంచార్జి సంకె.వెంకటేష్, తో పాటు పిట్ కమిటీ సభ్యులు చీకటి.వంశీ, చైతన్య రెడ్డి, నవీన్, ప్రశాంత్, కలవల శ్రీనివాస్ గని కార్మికులు పాల్గొన్నారు.

# కరాటే పోటీల్లో కాకతీయ స్మార్ట్ కిడ్స్ పాఠశాల విద్యార్థికి పసిడి పతకం



కరీంనగర్ అక్టోబర్ 23(మనంబ్యూరో )..శ్రీలంకలో 2026 అక్టోబర్ 16, 17 తేదీలలో నిర్వహించిన అంతర్జాతీయ స్థాయి కరాటే పోటీలలో కాకతీయ స్మార్ట్ కిడ్స్ పాఠశాలకు చెందిన కరాటే క్రీడాకారుడు కె. ఆదిత్య సాయి భారతదేశం తరఫున పాల్గొని, అండర్-14 బాయ్స్ కటా విభాగంలో బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నాడు.ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ గున్నాల క్రాంతి కుమార్ , కరాటే కోచ్ శ్రీ ఆర్. ప్రసన్న కృష్ణ ఆదిత్య సాయిని అభినందించారు. అంతర్జాతీయ స్థాయి పోటీల్లో బంగారు పతకం సాధించి దేశానికి, పాఠశాలకు, తల్లిదండ్రులకు గర్వకారణంగా నిలిచాడని వారు పేర్కొన్నారు. క్రీడల పట్ల ఆసక్తి, క్రమశిక్షణ, నిరంతర సాధనతో ఆదిత్య సాయి ఈ ఘనత సాధించడం అభినందనీయమని తెలిపారు. కోచ్ ఆర్. ప్రసన్న కృష్ణ గారి శిక్షణ, మార్గదర్శకత్వంలో అంతర్జాతీయ స్థాయిలో పతకం సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.భవిష్యత్తులో ఆదిత్య సాయి మరిన్ని ఉన్నత విజయాలు సాధించి దేశానికి మరింత పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కాకతీయ స్మార్ట్ కిడ్స్ పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు మరియు సిబ్బంది ఆదిత్య సాయికి హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.

# రైతుల సాగునీటి సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి



ఇల్లందకుంట, అక్టోబర్ 23 (మనం న్యూస్): ఇల్లందకుంట, జమ్మికుంట మండలాల్లోని వరి పొలాలను తెలంగాణ రక్షణ సేన పార్టీ నాయకులు శుక్రవారం క్షేత్రస్థాయిలో సందర్శించి రైతులు ఎదుర్కొంటున్న సాగునీటి సమస్యలను పరిశీలించారు. సమయానికి విద్యుత్ సరఫరా లేక, పంటలకు సాగునీరు అందక వరి పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరుగాలం కష్టపడి పంటలు సాగు చేస్తున్న రైతులు ప్రస్తుతం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని నాయకులు పేర్కొన్నారు. వ్యవసాయానికి అవసరమైన విద్యుత్‌ను సకాలంలో సరఫరా చేయడంతో పాటు, వరి పంటలకు సరిపడా సాగునీరు అందించేలా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న సాగు ఖర్చులను దృష్టిలో ఉంచుకొని వరి పంటకు క్వింటాల్‌కు రూ.4,000 మద్దతు ధర ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు. రైతుల కష్టాలను గుర్తించి, పంటలు ఎండిపోకుండా తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన పార్టీ నాయకులు జంపాల రితేష్, అంబాల హరీష్, కొత్తూరి నరేష్, గుండారపు కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# పోలీసులకు వ్యాసరచన పోటీలు




కరీంనగర్ అక్టోబర్ 23(మనం బ్యూరో )..కరీంనగర్ పోలీస్ కమీషనరేట్ కేంద్రంలో శుక్రవారం పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా కమీషనరేట్‌లోని పోలీసు అధికారులు మరియు సిబ్బందికి రెండు కేటగిరీలలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు.కరీంనగర్ పోలీస్ కమీషనరేట్ కేంద్రంలోని అస్త్ర కన్వెన్షన్ హాలు నందు జరిగిన ఈ పోటీలలో పోలీస్ కానిస్టేబుల్ నుండి ఏఎస్సై వరకు గల సిబ్బందికి ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలు పోలీసుల నుండి ఎటువంటి సేవలు ఆశిస్తారు. లేదా "పోలీసు అధికారుల జీవితాలలో సోషల్ మీడియా పాత్ర దాన్ని వ్యసనాన్ని అధిగమించి వ్యక్తిగత సామాజిక ప్రయోజనాలకోసం సద్వినియోగం చేసుకోవడం ఎలా " అనే అంశంపై, ఎస్సై మరియు ఆపై స్థాయి అధికారులకు "పౌరుల మన్ననలు పొందడానికి పోలీసులు చేయవలసిన కృషి" లేదా "నేల స్థాయిలో పోలీసింగ్ బలోపేతం చేయడం" అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కమీషనరేట్‌కు చెందిన అన్ని పోలీసు స్టేషన్లు మరియు విభాగాల నుండి మొత్తం 90 మంది పోలీసులు ఈ పోటీలో పాల్గొన్నారు.

# హ్యాండ్ బాల్ ఎంపిక పోటీలు



కరీంనగర్ అక్టోబర్ 23(మనం బ్యూరో)...ఉమ్మడి కరీంనగర్ జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ స్టేడియంలో ఉమ్మడి జిల్లా స్థాయి జూనియర్స్ గర్ల్స్ అండర్ (19) ఇయర్స్ సెలెక్షన్స్ ట్రయల్స్ నిర్వహించడం జరుగుతుంది. ఈ ఎంపిక పోటీలలో పాల్గొనే క్రీడాకారులు ఒరిజినల్ ఆధార్ కార్డు డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్ తీసుకొని ఉదయం 10గంటలకు ట్రెజరర్ ఎన్ ప్రభాకర్, హ్యాండ్ బాల్ కోచ్ వెంకటేష్ లకు రిపోర్ట్ చేయాగలరని, ఈ పోటీలలో ఎంపికైనా క్రీడాకారులు ఈనెల 31నుండి వచ్చే నెల 02 వరకు ఖమ్మం జిల్లా లో జరిగే రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలలో పాల్గొనడం జరుగుతుందని ఉమ్మడి కరీంనగర్ జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ అధ్యక్ష/ కార్యదర్శులు వీర్ల వెంకటేశ్వర్ రావు బసరవేణి లక్ష్మణ్ తెలిపారు.